GIRDHARI, RNI Regn.No.TELTEL/2021/80612, Date of Pub - 25th of every month
Date posting - 1st of every month at BPC-IV, Patrika Channel, HYD - 01
Postal Regn.No.HQ/SD/525/2024-2026; Licensed to Post without prepayment
WPP No.PMG/TS/HQR/SC-04/WPP/2024-2026




ప్రణవ పతాకావిష్కరణ



ఊరేగింపులు - ఉత్సవాలు







ఆటలు - పాటలు




Edited, printed, published and owned by Swami Sundara Chaitanyananda, Printed at M/s Karshak Print Solutions Pvt. Ltd., Moula Ali, Hyd - 500 040.
IF UNDELIVERED PLEASE RETURN TO :
SUNDARA CHAITANYA ASHRAM
HYDERABAD - 500 043

గిరిధారి


జనవరి 2026


శాశ్వత చందా రూ.1200/-
10 సం॥ లకు





పూజ్య గురుదేవుల 78వ జయంత్యుత్సవాలు















ప్రార్థన




శ్లో ॥ నమస్తే శారదే దేవి

కాశ్మీర పురవాసిని ।

త్వామహం ప్రార్థయే నిత్యం

విద్యా దానం చ దేహి మే ॥

ఓ దేవీ! శారదామాతా! కాశ్మీర పుర వాసినీ! నీకు నా నమస్కారము. నాకు జ్ఞానదానమును ప్రసాదించమని సదా నిన్ను నేను ప్రార్థిస్తాను.



పండుగలు

14-1-2026 - భోగి

15-1-2026 - సంక్రాంతి

23-1-2026 - వసంత పంచమి

25-1-2026 - రథ సప్తమి

29-1-2026 - భీష్మైకాదశి

గీతధారి

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి : 41 సంచిక : 2

వ్యవస్థాపకులు :
శ్రీ స్వామి సుందర చైతన్యానంద

ఇందులో

సంపాదకులు : శ్రీ స్వామి సుందర చైతన్యానంద

ప్రార్థన	3
విషయ సూచిక	4
ఆప్తవాక్యం	5
ఆనంద కడలిలో చైతన్య కెరటం	8
మంగళ దీపాలు	11
ప్రణుతి	12
శ్రీకృష్ణ కథాగానం	13
మహిష్మతిలో శంకరయతి	17
గురు మహిమ్నః	20
ఓ కథ చెప్పనా!	26
సాధన సౌలభ్యానికి ద్వాదశ సోపానాలు	29
అనుగ్రహ వర్షం	31
అక్షర కుసుమ పరాగం	35
చైతన్య ప్రభంజనం	37
స్వామీజీ లేఖ	42

జీవిత సభ్యత్వం - రూ. 1200 /-
(10 సంవత్సరములు)

డి.టి.పి. & కవర్ డిజైన్
సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్

ప్రింటింగు : బైండింగు
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్

వివరములకు : సుందర చైతన్యాశ్రమం,
దుండిగల్ రోడ్, హైదరాబాద్ - 500 043. ఫోన్:(08418)255777, 9100908777

Visit us at : www.sundarachaitanyam.com (email : admin@sundarachaitanyam.org)



ఆప్తవాక్యం

సంక్రాంతి

ధనుస్సును వీడి మకరంలోకి సూర్యుని ప్రవేశం
దివాకరుని కది క్రాంతి. భువికి అదే సంక్రాంతి.

సంక్రాంతి శుభదినాన జలాలన్నీ నిర్మల గంగలే
విశ్వశాంతి ఉదయించిన జగత్తంతా ప్రేమల పొంగులే


ఆరిపోయేందుకు వచ్చేది కాంతి కాదు.
కాలక్రమణాన్ని సూచించేది సంక్రాంతి కాదు.

క్షణకాలమైనా వెలగదు పచ్చగడ్డి
వెలిగినా క్షణముండదు చిచ్చుబుడ్డి

కురుస్తున్నది వెలుపల పెద్ద మంచు
మంచిని మనసులో బుద్ధిగా ఉంచు

మల్లెలై పూయాలి మనసులు
మహర్షులై మెలగాలి మనుషులు

ఆ రోజే జగతికి క్రాంతి.....
ఆ రోజే జీవికి సంక్రాంతి.



మనసులో "మంచి" పూలు పూచిన రోజు
మనిషిలో శాంతిగాలులు వీచిన రోజు
సమతకు సమాజము చేతులు చాచిన రోజు
మనిషిని మనిషిగా మనుజులు చూచిన రోజు
ఏవార మడిగినా 'గురు' వారమేనని

శిష్యులందరు గుమిగూడి పలికిన రోజు
ఏ నోట విన్నా వేదమ్మ పలుకులు
నాదమై ఖేదమును తరిమిన రోజు
అదియే భువికి క్రాంతి...... అదియే బ్రతుకుకు సంక్రాంతి.
శాంతి శాంతి అంటూ చేసుకుంటున్నారు వాంతి
అలజడులు చేస్తూపోతే ఏనాడూ రాదు కాంతి




రంగవల్లులతో వాకిళ్ళు వెలిగిపోతున్నాయి
రంగని నామం కరువై వాక్కులు వెలవెల పోతున్నాయి.

ఏదిక్కడ సంక్రాంతి?
ఎప్పుడిక మనకు నిజకాంతి?

అంటరానితనము మంట కలిసిన దినము
ఇంటికి కరంటు కోత ఉండదనిన దినము
మాయల చదువులు మనిషి కబ్బని దినము
కట్టెలై కట్నాలు కాలిపోయిన దినము
అత్తలు అమ్మలై అగుపించిన దినము
అప్పువాని వలె అల్లు డుండని దినము
దానాలు శ్రమలుగా గోచరించని దినము
శ్రమలు దానాలుగా కనిపించని దినము
శాంతి భిక్షను పెట్టే సన్యాసి రాజు
భిక్షను శాంతిగా గుర్తించని రోజు
సమతా శంఖమును పూరించిన దినము
మానవతా జ్యోతిని వెలిగించిన దినము
అదియే నిజమైన సంక్రాంతి. అప్పుడే మనకు చెక్కు చెదరని శాంతి.

మొక్కవోని సంక్రాంతి నీ సంస్కృతి.
నేటి దేశ దుస్థితికి అదొక్కటే పరిష్కృతి



కల్లోల జగతికి అదే సరియైన వారధి
వారసుడవైన నీవు కావాలి సారథి

రాలినా పొగడలు పరిమళిస్తాయి
కాలినా కాగడాలు కాంతినిస్తాయి

బాధలు బరువులు ఒకవైపు ఉండనీ
బోధలో హృదయాన్ని నిండుగా పండనీ
అన్ని విద్యలలోన అధ్యాత్మమే గొప్ప
లేదేదీ ఇలలో ఆత్మకన్నా గొప్ప

రేకు లెన్ని ఉన్నా పువ్వు అద్వైతమే
కారణ మేదైనా నవ్వు అద్వైతమే
నేనని భ్రమించినా నీవూ అద్వైతమే
నువ్వని పలికినా నేనూ అద్వైతమే.

అద్వైతమే శాంతి..... అద్వైతమే కాంతి.
అద్వైత మెరిగిననాడే నిజమైన సంక్రాంతి.

అందాల చందమామ అందరికీ మామ
శ్యామ - శ్యామ అనుటే మనందరికీ సుషుమ
అరుదెంచాలి అన్నివైపుల శాంతి కిరణాలు
అగుపించాలి అందరికి శ్యామ చరణాలు
నిలవాలి మీ చుట్టు కాంతి వలయాలు
కావాలి మీ ఇళ్ళు శాంతి నిలయాలు.

ఓం స్వామి సుందర చైతన్యానంద

ఆనంద కడలిలో చైతన్య కెరటం

శ్రీమతి సి.పద్మ

గాలిలో గీతలు గీసినా, నీటి మీద రాతలు వ్రాసినా కనిపించినట్లే ఉంటాయి. అంతలోనే కనుమరుగై పోతాయి. అందుకే ఆకాశంలో బాటలు వేయలేము. సముద్రంలో నడక సాగించలేము. నేల మీదే మార్గాలను నిర్దేశించ గలము.



ఉత్కృష్ట జన్మలకు, నికృష్ట జన్మలకు ముక్తి లేదు. దేవ తిర్యక్కులలో ముక్తి కాంక్షే లేదు. ఇక ముక్తికాంత ఎలా లభిస్తుంది? ముముక్షుత్వానికి, మోక్షానికి నరజన్మమే ద్వారం. కారణం, మానవ లోకం లోనే సనాతనధర్మ బాట ఉంది. భూమి మీదే తరించే మార్గముంది.

ఏషః పన్థా మయోద్దిష్టో యేన యాన్తి మహర్షయః!

జ్ఞానవంతులైన మహర్షులు చరించిన మార్గం లోనే మనం తరించాలి. ఎవరు తరించినా ఆ బాటలోనే చరించి తరించారు. ఋషులు నడచిన బాటే మనకు శ్రీరామరక్ష.

నరులకే మోక్షం ఉన్నా నరు లందరికీ మోక్షం లేదు. ఆచార్యవాన్ పురుషో వేద - ఆచార్యుని పొందిన వాడే ఆత్మజ్ఞానాన్ని పొందుతాడు.


లోకంలో కారుచీకట్లు కమ్మినప్పు డల్లా సనాతనధర్మ సంప్రదాయంలో ఒక బ్రహ్మజ్ఞాని ఉదయిస్తాడు. ఒక వ్యాసుడు, ఒక శంకరుడు, ఒక విద్యారణ్యుడు, ఒక సుందర చైతన్యుడు. వీరందరూ ఋషులు, ఋషిబిడ్డలు. మనమూ ఋషిబిడ్డలమే. ఆ వారసత్వానికి చెందిన ధన్య జీవులమే.

పుణ్యనది లాంటి శ్రీ చైతన్యుని పవిత్ర జీవనం
పావన గంగ వంటి వారి దివ్య చరిత
సమకాలీనులకే కాదు - భావి తరాలకూ ఆశాదీపం.
ఆరు దశాబ్దాలుగా జ్ఞాన పాదిని అందిస్తూ, విజ్ఞాన పంటను పండిస్తూ
ఆర్షధర్మ దీపానికి ఆయువునే తైలముగా మార్చిన వారి త్యాగ నిరతి
మానవాళికే మణిహారం.

బ్రహ్మముహూర్తములో ఉదయించిన మన గురువు
బ్రహ్మజ్ఞానాన్ని వర్షించేందుకు మన మధ్యకు వచ్చాడు
జ్ఞానబ్రహ్మగా బుద్ధిలో కొలువు దీరాడు.
హరిదాసు పాటతో శ్రుతి కలిపిన ఆ శిశువు
హరి నామాన్ని గుండె గుండెను మీటి వినిపించాడు
శ్రుతిమందిర మనే మోక్షధామంలో జ్ఞానసరస్వతిగా భాసిస్తున్నాడు.

ఆయన ఎవరి కోసం ఉదయించాడు? తన కోసమా? లేక మన కోసమా?
తన కోసమే నని తెలిసి తనను తాను తెలుసు కున్నాడు.
ఉన్నది తానే నని తెలిసి అవనిలో వెలుగు తున్నాడు.
వేదాంత వెన్నెలలు వెదజల్లు తున్నాడు.

ఆదిత్యుడు ఎవరి కోసం వెలుగుతాడు? ఏ కర్తవ్యంతో ఉదయిస్తాడు?
వెలుగు తన స్వరూపం - వెలగడం తన స్వభావం.
వెలుగు తానైన వాడు ఎక్కడ ఉంటే అక్కడే వెలుగు.
వెలుగు ఒడిలో తిమిరం ఇమడలేదు కనుక
ఆదిత్యుని ఆగమనంతో తిమిరం మటుమాయం.




వాస్తవానికి చీకటి అస్తిత్వం ఏమిటి?
ఆదిత్యుని అభావమే కదూ?
అలాగని ఆదిత్యుడు లేని దెప్పుడు?
తిరిగే భూమినే తిమిరం చుట్టుకుంటుంది.

అనాదిగా ఉన్న అజ్ఞానం మనకు పుట్టుక తోనే ఉంది.
అజ్ఞానం దుఃఖానికి కారణం కనుక అజ్ఞానం శిష్యుడి శత్రువు.
అజ్ఞానాన్ని అంగీకరించని గురువు అజాత శత్రువు.
శత్రువే లేనపుడు త్రుంచే దెవరిని, త్రెంచే దేమిటి?
లేని దానిని లేనిదిగా నిరూపించడమే.

అజ్ఞానమే లేనపుడు ఈ దుఃఖ మెక్కడిది గురుదేవా!
అని శిష్యుడు దిక్కు తోచక విలపిస్తాడు.
నాయనా! అది త్రాడో పామో ఒకసారి పరికించు,

నీ దుఃఖం సత్యమో అసత్యమో ఒకసారి విచారించు
అని దయ గల దేవుడు దీపాన్ని తెస్తాడు.
ఆ దీపమే ప్రమాణము - ప్రమాణ వెలుగే గురువు.
గురువు ముళ్ళబాటను దాటి వచ్చాడు
అందుకే ఆయనకు పూలబాటను పరుస్తాము
స్వర్ణాభరణాలతో ఆ దివ్యరూపుని తనివిదీర అలంకరిస్తాము.
కానీ, అవి ఆయనకు తృణప్రాయము.



వస్తురహిత చైతన్యాన్ని వస్తువులు ఆకట్టుకోగలవా!
నిర్విషయానంద స్వరూపుని విషయాలు ఆకర్షించగలవా!
సర్వం తానైన వానిని బాధించే శక్తి ఎవరికి? సుఖపెట్టే సామర్థ్య మెవరిది?

అర్థం చేసుకోలేని వారికి అంతా సంశయమే. అర్థమైన వారికి అంతా ఆశ్చర్యమే. సంశయాలతో బాగుపడిన వారు లేరు. విశ్వాసంతో చెడిన వారు లేరు.

"నేను అనే అనంత చైతన్య సాగరంలో **1947** డిసెంబరు **25** వ తేది సుందర చైతన్య మనే ఈ అల లేచింది. అన్ని అలలు నాలోనే లేచి పడుతూ ఉన్నాయి".
ఇవి గురుదేవుల ముఖ కమలం నుండి జాలువారిన అమృత రస గుళికలు.
మాటలు కావవి మంత్రాలు. వాక్యాలు కావవి మహావాక్యాలు.

మరి నేను, మీరు, వారు, వీరు? అందరూ అంతే.
పెద్ద అల, చిన్న అల అనే భేద బుద్ధిలో అనంతమైన స్వరూపం ఇమడలేక పోతోంది.
ఇదే మాయ. మహిమను దాచే మహామాయ.
దేహస్థాయిలో అందరమూ అలలమే. స్వరూపస్థితిలో అందరూ సచ్చిదానంద స్వరూపులే.
నోదేతి నాస్తమేత్యేకా సంవిదేషా స్వయంప్రభా . . . .
ఉదయాస్తమయాలు లేని, అద్వయ స్వప్రకాశ చైతన్యమే ఉంది.
అందరమూ సుందరమే
అందరమూ చైతన్యమే
అందరమూ ఆనందమే
సుందర చైతన్యానంద సద్గురువుకు నిజమైన శిష్యులమే.

జై జై గురుదేవ!

మంగళ దీపాలు

ధారావాహిని-22

స్వామి సుందర చైతన్యానంద

వర్తమానమే బహుమానం

శ్లో॥ గతే శోకో న కర్తవ్యో
భవిష్యం నైవ చింతయేత్ ।
వర్తమానేన కాలేన
వర్తయన్ని విచక్షణాః ॥

భావము:
గతించిన దానిని గూర్చి వ్యథ చెందకూడదు. భవిష్యత్తును గూర్చి కలలు కనకూడదు. వర్తమానము నందే వివేకవంతులు చరిస్తుంటారు.

వ్యాఖ్య

కాలరూప సుడిగుండములో చిక్కిన మానవులు కాలము యొక్క విలువ తెలియక బ్రతుకును వమ్ము చేసుకొంటూ జీవిస్తారు. గత స్మృతులు - భావి ఊహల మధ్య శిలువ వేయబడుతూ ఉంటారు.

గతం బరువుగా నడిచి పోయింది. బరువైన గతాన్ని తలచినంత మాత్రాన బలము లభిస్తుందా? గతం గతించింది. నీరు వెళ్ళిన తరువాత వంతెన నిర్మించడం ఎలాంటిదో, గతాన్ని గూర్చి చింతించడము కూడా అలాంటిదే. వెళ్ళిన గతము తిరిగి రాదు. గతాన్ని గూర్చి ఆలోచిస్తుంటే వర్తమానము కూడా గతం లోకి జారిపోతుంది.


గత స్మృతులు భవిష్యత్తును ఎలా ఆటంకపరుస్తున్నాయో, భావి ఊహలు కూడా అంతే. భవిష్యత్తును గూర్చి ఎన్నెన్నో స్వప్నాలు కంటుంటాడు మానవుడు. రేపుకు రూపేమిటి? ఒకవేళ రేపుకు రూపు దిద్దే ప్రయత్నమేదైనా ఉంటే అది సాగవలసింది నేడే కాని రేపు కాదు కదా! గాలిమేడలు నిర్మించడము మహా ప్రమాదకరము. చూస్తుండగానే భవిష్యత్తు వర్తమానం లోకి దిగుతుంది. ఇది తెలిసే లోగా వర్తమానము గతం లోకి వెళ్ళిపోతుంది.

గతాన్ని ఆలోచించడంలో ఏం జరుగుతుంది? వర్తమానము పాడవుతుంది. భవిష్యత్తును ఊహించడంలో ఏం మిగులుతుంది? వర్తమానము మిగలకుండా అదృశ్య మవుతుంది. గతం తిరిగి రాదు. భవిష్యత్తు వస్తుందో లేదో తెలియదు. ఉన్నది వర్తమానము. ఇదియే భవిష్యత్తు కానున్నది. వర్తమానంలో వర్తించే వ్యక్తి ఎప్పుడైనా అభివృద్ధిని సాధించ గలడు.

(28వ పేజీ చూడుము)

ప్రణుతి

శ్రీ మద్దిపట్ల సుబ్రహ్మణ్య శర్మ
రేపల్లె




శ్రీనందనందన పద
ధ్యానానందైక తుందిలాత్మని, బ్రహ్మ
జ్ఞానిని, సుందర చైత
న్యానంద స్వామిని శరణంచు భజింతున్ 1



ఏ స్వామి సుందరశ్రీ స్వరూపముగన్న
అతిలోక పారవశ్యంబు గలుగు
ఏమౌని మంజులామృత భాషణము విన్న
సన్మార్గ వర్తనాసక్తి గలుగు
ఏ యోగి పదసేవనా యోగమబ్బిన
భక్తి భావప్రభావంబు వెలుగు
ఏ మహర్షి దయార్ద్ర దృక్కులు సోకిన
చిత్త చాంచల్య దుస్థితి తొలంగు

ఆ మహాత్మని వేద వేదాంతశాస్త్ర
బహుపురాణేతిహాస ప్రబంధ సత్కథా
రహస్యార్థ విజ్ఞాన సారమతిని
ప్రణుతిజేసెద వాక్కుసార్థకత నొంద 2



వేణునాదమో, ఆమని పికరవమ్మొ
స్వామిగానమ్మొ, స్వరసుధాసాగరమ్మొ
భక్తి(బరవశమందుచు పాడుచుండ
భక్తులెల్లరు గోపాల బాలురపుడు 3


శతము మించిన జ్ఞానయజ్ఞము లొనర్చి
భక్తి వర్షము కురిపించి, భక్తహృదయ
సీమ వైరాగ్య బీజముల్ చెలగినాటి
సౌఖ్యసస్యము పండించు స్వామి గొలుతు 4

* * *


శ్రీకృష్ణ కథాగానం

ధారావాహిని-3

స్వామి సుందర చైతన్యానంద




(32) కొంగరూపమున వచ్చిన బకుడు
మ్రింగుడు పడని కృష్ణుని మ్రింగెను
కంఠము గాల్చి దవడలు చీల్చి
కాలానలమై చంపెను బకుని
వినవే మనసా! వినిపించెదను
వీనుల విందుగా వివరముగా ॥ వినవే ॥



(33) పాపరూపుడు అఘరాక్షసుడు
మ్రింగెను గోపుల గోవులను
నమ్మినవారిని కడ తేర్చుటకు
అసురునిలో చేరి అంతము చేసె ॥ వినవే ॥


(34) అనంతుని మాయను ఎరుగని అజుడు
గొనిపోయె గోవుల బాలురను
వేణుగోపాలుడు ధేనువులాయె
గోపాల గోవత్స రూపము లాయె ॥ వినవే ॥






(35) మాయ చేసితిని మహిమ నెరుగక
మోసపడితిని మాయలో పడి
కరుణించమని కమలాకాంతుని
వేడెను విరించి ముఖములు దించి ॥ వినవే ॥


(36) కాళింది మడుగు విషజలమాయె
అనిలము పీల్చిన అసువులు పోయె
కాళీయుని పనిబట్టిన కృష్ణుడు
పడగలపై నర్తించిన వీరుడు ॥ వినవే ॥





(37) అర్ధరాత్రి అరణ్యము నందు
అలుముకున్నవి అగ్నికీలాలు
రక్షింపుమని గోపులు వేడగా
దావానలమును పానము చేసె ॥ వినవే ॥


(38) యమునా తీరాన వంశీరవము
వినిపించినచో పరవశము
అమరగానము అమృతనాదము
తన్మయమైనది బృందావనము ॥ వినవే ॥





(39) ఉండవు పువ్వులు కాయవు కాయలు
ఏమని చెప్పుదు వేణువు పుణ్యము
మధుసూదనుని అధరామృతమును
తన్మయమగుచు పానము చేయును ॥ వినవే ॥


(40) హేమంతమున యమునాతటిపై
కళకళ లాడుచు గోపకాంతలు
దేవి కాత్యాయని వ్రతమును చేసిరి
నందకుమారుడు పతి కావాలని ॥ వినవే ॥






(41) యమునా తోయములో జలకాలాడే
తరుణుల గాంచెను తోయజనయనుడు
వలువలు గొనిపోయి తరువు నెక్కెను
పరువు మాని పరుగున రమ్మనెను ॥ వినవే ॥

(42) వలువలు పోయె విలువలు పోయె
మానము లుంచుము మానసహరణ
మానావమానాలు అభిమానములే
విడిచి రండని పలికెను విభుడు ॥ వినవే ॥





(43) వింత ఏమిటో ఇంతులు గనిరి
తానెరుగనిది ఇలలో లేదని
చిత్తము లిచ్చిరి వచ్చెద మనిరి
అందరు పొందిరి వ్రతఫలము ॥ వినవే ॥

(44) గోవులు కాచే బాలురు గోవులు
హరి నాశ్రయించిరి ఆకలి యనుచు
వనమున యాగము చేసెడి విప్రుల
వద్దకు పంపెను వాసుదేవుడు ॥ వినవే ॥





(45) విని విననట్లే విప్రులు మెలిగిరి
విప్రసతులు విని ఆదరించిరి
సంద్రము చేరే నదుల చందమున
చూడవచ్చిరి వారిజనయనుని॥ వి ॥

(46) యాగము ఫలము మాధవుడేనని
తెలియరు విప్రులు ఎరిగిరి వనితలు
పడతుల బ్రోచెను పంకజనయనుడు
పరితపించిరి భూసురవరులు ॥ వినవే ॥





(47) ఇంద్రయాగమును నందాదిగోపులు
చేయవద్దని వారించెను హరి
గిరియే సిరియని నిజమెరిగించి
పూజించమనెను గోవర్ధనుని ॥ వినవే ॥

(సశేషం)

మహిష్మతిలో శంకరయతి

ధారావాహిని-8

స్వామి సుందర చైతన్యానంద

శంకర - మండనుల శాస్త్రార్థము

ప్రాతఃకాలమైంది. బాలభానుని రాకను సూచిస్తూ తూర్పు దిక్కును అలుముకున్నాయి అరుణకాంతులు. కమల బాంధవుడు కనిపించాడు. మెల్లమెల్లగా ఎర్ర తామరలు విచ్చుకుంటున్నాయి. జ్ఞానసూర్య తేజముచే దేదీప్యమానంగా శోభిస్తున్న శ్రీ శంకరులు, ప్రభాకరుని తేజముతో వికసించిన ఎర్ర తామరల వలె కాషాయ రంగు వస్త్రముతో శోభిస్తున్నారు.

అది ప్రభాత వేళ. శ్రీ శంకరుల యశస్సు దిగ్దిగంతముల వ్యాపించే సుప్రభాత వేళ. కర్మ చీకట్లు అదృశ్యమై జ్ఞాన తేజము ఆవిర్భవించే సుప్రసన్న వేళ.

ఇది ఉదయం. శుభోదయం. జ్ఞాన వెలుగులతో ప్రవేశించే నవోదయం. అభినవోదయం. 'గుడ్ మార్నింగ్' కాదిది. పుణ్యాల పంటగా ప్రాప్తిస్తున్న 'గురు మార్నింగ్'.

పండిత మండలితో ప్రకాశిస్తున్న సభా మధ్యమునకు వాదానికై వేంచేశారు శ్రీ శంకరులు. శాస్త్రార్థమును ఆలకించుటకు, శంకర మండనులను తిలకించుటకు మహిష్మతీ నగరము లోని విద్వత్సమాజము అరుదెంచింది.

మండన పండితుని భార్య ఉభయభారతి అధ్యక్ష పీఠమును అలంకరించింది. 'మధ్యస్థ' పదవిని అధిష్ఠించింది. శ్రీ శంకర మండనుల వాదభేదమును పరీక్షించుటకు దివి నుండి భువికి అరుదెంచిన శారదయా! అన్నట్లు ప్రకాశిస్తోంది.

శంకర మండనులు ఉభయులు వాదమునకు సిద్ధమయ్యారు. ఉభయులలో ప్రకాశించే జ్ఞానమును గ్రహించగల ఉభయ భారతి ఇరువురి కంఠముల యందు ఒకొక్క ప్రసిద్ధమైన పూలమాలను ఉంచింది.

మాలా యదా మలినభావ ముపైతి కంఠే,
యస్యాపి తస్య విజయేతర నిశ్చయః స్యాత్ ॥

'ఏ క్షణాన ఎవరి కంఠము నందలి పూలమాల వాడిపోతుందో ఆ క్షణాన అతని ఓటమి నిర్ణయింపబడినట్లే' అని పలికి తన గృహ కార్యములలో నిమగ్నమైంది. పతికి భోజనమును, యతికి భిక్షను సిద్ధం చేసే ప్రయత్నంలో ఉండిపోయింది. వాదము ప్రారంభమైంది. శాస్త్రార్థ నిర్ణయము జరుగబోతోంది. సభా ప్రాంగణము క్రిక్కిరిసి ఉంది. ప్రథమంగా శ్రీ శంకరులు ప్రతిజ్ఞ చేస్తూ శాస్త్రార్థమును ప్రవేశ పెట్టారు.

పరావరజ్ఞః స పరావరైక్య పరాం ప్రతిజ్ఞామకరోత్ స్వకీయామ్

'పరావరజ్ఞుడైన శ్రీ శంకర యతీంద్రుడు పరావరైక్యపరమైన తన ప్రతిజ్ఞను చేశాడు' అని మాధవ విద్యారణ్యుల వర్ణనము.

శ్రీ శంకర విజయములో ఈ సందర్భమున ఆచార్యుల వారిని పరావరజ్ఞుడని ప్రస్తావించడం జరిగింది. 'పర' అంటే కారణము. 'అపర' అంటే కార్యము. ఈ రెంటిని ఎరిగినవారు అయినందున శ్రీ శంకరులు పరావరజ్ఞు లైనారు. 'పర' అంటే రానున్నది అని అర్థము. 'అపర' అంటే పోయినది అని అర్థము. భూత భవిష్యత్తులను తెలిసినవారు అయినందున శ్రీ శంకరులు పరావరజ్ఞు లైనారు.

'పర' అంటే బ్రహ్మము. 'అపర' అనగా జీవుడు. జీవబ్రహ్మలు ఏకమే అని గ్రహించిన వారు అయినందున శ్రీ శంకరులు పరావరజ్ఞు లైనారు. 'పర' అనగా గొప్పది. 'అపర' అనగా అల్పమైనది. మహత్తులో, అణువులో అంతటా నిండి యున్న పరమాత్మను ఎరిగినవారు అయినందున శ్రీ శంకరులు పరావరజ్ఞులైనారు. పరావరజ్ఞులైన ఆచార్యులు చేసిన ప్రతిజ్ఞ పరావరైక్యపరం అన్నారు మాధవాచార్యులు. అంటే, జీవబ్రహ్మైక్య పరమైనది అని భావము. అద్వైత ప్రతిపాదనము అనేది ఇక్కడ సూక్ష్మ విషయము.

శ్రీ శంకరుల ప్రతిజ్ఞ :

బ్రహ్మైకం పరమార్థం సచ్చి దమలం విశ్వ ప్రపంచాత్మనా
శుక్తీ రూప్య పరాత్మనేన బహుళా జ్ఞానావృతం భాసతే,
తత్ జ్ఞానాన్నిఖిల ప్రపంచ నిలయా స్వాత్మన్యవస్థా పరం
నిర్వాణం జనిముక్త మభ్యుపగతం మానం శ్రుతే ర్మస్తకమ్ ॥

'బ్రహ్మము ఏకము. పరమార్థము. సచ్చిదానంద స్వరూపము. నిర్మలము. ముత్తెపు చిప్పను విమర్శించి చూడని వానికి అది వెండి వలె గోచరించునట్లు, యథార్థ వస్తువును ఎరుగని వానికి పరమాత్మ ప్రపంచముగా గోచరించు చున్నది. అట్టి పరమాత్మ జ్ఞానము వలన సమస్త ప్రపంచము సమూలముగా లయమై స్వరూప స్థితి కలుగుతుంది. అది పుట్టుక తెలియని పరమ నిర్వాణముగా శోభిస్తున్నది. దీనికి ఉపనిషత్తులే (శ్రుతిశిరస్సు) ప్రమాణములు. ఇదియే మా సిద్ధాంతము.

నా జయము విషయములో నాకు ఏ మాత్రము సంశయము లేదు. అయినా, చెబుతున్నాను. విను. ఒకవేళ నేను ఓడినట్లైతే సన్న్యాసాశ్రమాన్ని, కాషాయ వస్త్రాన్ని త్యజిస్తాను. శ్వేత వస్త్రమును ధరిస్తాను' అని శ్రీ శంకరులు ప్రతిజ్ఞ చేశారు. వాద కుతూహలం గల మండన పండితుడు ఉత్సాహ వదనంతో మందహాసమును చిందిస్తూ తన ప్రతిజ్ఞను వినిపించాడు.

మండనుని ప్రతిజ్ఞ :

వేదాంతా న ప్రమాణం చితి వపుషి పదే తత్ర సంగత్యయోగా
త్పూర్వో భాగః ప్రమాణం పదచయగమితే కార్యవస్తు న్యశేషే।
శబ్దానాం కార్యమాత్రం ప్రతి సమధిగతా శక్తి రభ్యున్నతానాం
కర్మభ్యో ముక్తి రిష్టా తదిహతను భృతామాఽ ఽ యుషః స్యాత్సమాప్తేః ॥

'వేదము లోని కర్మకాండ భాగమే ప్రమాణము. ఉపనిషత్తులు చైతన్య స్వరూప బ్రహ్మమును ప్రతిపాదించి సిద్ధ వస్తువును వర్ణిస్తూ ఉన్నాయి. అందుచేత నేను ఉపనిషత్తులను ప్రమాణముగా గ్రహింపను. విధిని ప్రతిపాదించుటయే వేద తాత్పర్యము. శబ్దముల శక్తి కార్యమును ప్రకటించుట లోనే ఉంది. కర్మ చేయుట చేతనే ముక్తి లభిస్తుంది అని నా అభిప్రాయము. ఈ కర్మానుష్ఠానమును ప్రతి మానవుడు జీవితాంతము ఆచరించాలి. ఇదియే మా సిద్ధాంతము.

ఈ శాస్త్రార్థములో నేను పరాజితుడనైతే గృహస్థ ధర్మమును త్యజించి సన్న్యాసి నౌతాను' అని తన మీమాంసా సిద్ధాంతమును ప్రతిపాదిస్తూ మండనమిశ్రుడు ప్రతిజ్ఞ చేశాడు.

ఉభయుల ప్రతిజ్ఞలను విద్వన్మండలి ఆలకించింది. వాద ప్రతివాదములతో శాస్త్రార్థము మొదలైంది. మధ్యాహ్న కాలమున కొంతసేపు విశ్రమించి మరల శాస్త్రార్థము నందు ఉద్యమించేవారు.

అన్యోన్య ముత్తర మఖండయతాం ప్రగల్భం
బద్ధాసనౌ స్మితవికాసి ముఖారవిన్దౌ,
న స్వేద కంప గగనేక్షణ శాలినౌ వా
న క్రోధ వాక్ఖల మవాది నిరుత్తరాభ్యామ్ ॥

శంకర మండన లిరువురు సమ భావముగా తమ ఆసనములపై కూర్చొని, ముఖారవిందముల యందు చిరునగవు తాండవించు చుండగా వాదప్రతివాదములను ప్రసన్నముగా సాగించారు. శరీరముపై చెమటలు పోయలేదు. వణకుట జరుగలేదు. సమాధానము స్ఫురించక ఆకాశము వైపు తల ఎత్తి చూచుట లేదు. నిరుత్తరులై క్రోధముతో ఖలోక్తులను ప్రయోగించడం లేదు.

దినదినము వాదము అతిశయింప సాగింది. పండితుల సంఖ్య పెరుగుతూ ఉంది. పరస్పరము జయాభిలాష తీవ్ర మైనందున వాదము విస్తరిస్తూ ఉంది. అయినా ఈ వాక్సమరంలో రోషము దూరముగా ఉంది (దూరీకృతజన్యమర్షః).

శంకర మండనుల మధ్య సాగుతున్న వివాదమును ఆలకిస్తూ 'భళీ! భళీ!' అంటూ శ్రోతలు సభలో ధ్వనులు చేయసాగారు.

బ్రహ్మాదయః సురవరా అపి వాహనస్థాః,
శ్రోతుం తదీయ సదనే స్థితవంత ఊర్ధ్వమ్ ॥


'శంకర మండనుల వాదమును ఆలకించుటకు సురవరులైన బ్రహ్మాదులు కూడా వాదము సాగే భవనముపై నిలబడినారు'.

(సశేషం)

గురు మహిమ్నః

స్వామి సుందర చైతన్యానంద

అహేతుక దయాసింధుః బంధు రానమతాం సతాం ॥



సామాన్యులకు దయ రెండు విధాలుగా కలుగుతుంది.

1. అన్యత్ర దుఃఖ దర్శనేన - పరుల దుఃఖాన్ని చూచి దయ తలచడం.

2. స్వస్యాపి జాత దుఃఖిత్వాత్ - తన వారి దుఃఖాన్ని చూచి దయ తలచడం.

తన మన భేదాలు లేని గురువులో ఈ రెండూ ఉండవు కనుక ఆయన 'అహేతుక దయాసింధువు'. సదా వినమ్రులై వంగి నమస్కరించు వారికి ఆయన బంధువు కనుక ఆయన **బంధు రానమతాం సతాం.** సూర్యుడి నుండి కిరణాలు కదిలినట్లు, గురువు నుండి అవ్యాజమైన, అహేతుకమైన ప్రేమ ప్రసరిస్తుంది. ఎవరు దుఃఖపడుతూ ఉండినా ఇది మిథ్యా జగత్తులో జరుగుతూ ఉంది అని సక్రమంగా తెలిసిన వాడు గురువు. జ్ఞానం లేకపోవడం వల్ల దుఃఖం కలుగుతూ ఉంది కనుక, జ్ఞానాన్ని ప్రసాదించాలి అనే నిర్ణయమే కాని దుఃఖాన్ని నిర్ధారించడం, నివారించడం ఆయన సంకల్పం కాదు. దుఃఖం నిరాధారం కనుక, దుఃఖించదగింది ఈ ప్రపంచం లోనే లేదు అని బోధించడమే కర్తవ్యంగా భావించేవాడు ఆచార్యుడు. దుఃఖాన్ని గురించి అర్జునుడు యాభై శ్లోకాలలో తదేకంగా భాషిస్తే - **అశోచ్యాన్ అన్వశోచస్త్వం** అంటూ శ్రీకృష్ణుడు చిరునవ్వుతో బోధను ప్రారంభించాడు. దుఃఖాన్ని శాశ్వతంగా సమాధి చేయగల శక్తి ఒక్క జ్ఞానానికే ఉంది. ఏమీ ఇవ్వకుండానే అంతా ఇవ్వడం జ్ఞానంలో దాగి ఉన్న వైభవం. ఇదే గురు వైభవం. గోవిందుడు మాట్లాడని గురువైతే, గురువు మాట్లాడే గోవిందుడు. మరి అటువంటి మహిమ గల గురువును సమీపించడం ఎలా?


ఉపసదన విధిః

తమారాధ్య గురుం భక్త్యా ప్రహ్వః ప్రశ్రయ సేవనైః
ప్రసన్నం తమనుప్రాప్య పృచ్ఛే జ్జ్ఞాతవ్య మాత్మనః ॥


గురువు పట్ల శిష్యుడికి పారం తెలియని ప్రేమ, అనురాగము ఉండాలి. సదా ప్రహ్వీభావంతో, నమ్రకాయంతో నమస్కరిస్తూ ఉండాలి. ఇది సంప్రదాయం. గురు సన్నిధిలో వినీత వాక్యాలను వినమ్రంగా పలకాలి. అసందర్భ ప్రలాపాలతో గురు హృదయాన్ని భగ్నం చేయకుండా భద్రమైన పలుకులనే పలకాలి. భావయుక్తంగా, దోషరహితంగా, మితంగా, హితంగా పలకాలి. ఈ విధంగా వినీత వాక్యాలతో, నమస్కారాది సేవలతో గురు హృదయాన్ని స్పృశించి, కదిలించి, తృప్తిపరచి, ఆత్మతత్త్వాన్ని శిష్యుడు పరిప్రశ్నించి తెలుసుకోవాలి. సత్యకాముడు పన్నెండు సంవత్సరాలు శుశ్రూష చేసినా, గురువు ఒక్క అక్షరం కూడా అతడికి బోధించలేదు.

(34వ పేజీ చూడుము)

హైదరాబాద్ - సుందర చైతన్యాశ్రమంలో శ్రీరామాలయ నిర్మాణానికి విరాళములు సమర్పించిన భక్తులు




శ్రీ కె.కృష్ణ జయంత్ వంశీ
అమెరికా
రూ.5,00,000/-
(ఐదు లక్షలు)




డా॥ శ్రీ టి.నందకుమార్
అమెరికా
రూ.4,00,000/-
(నాలుగు లక్షలు)




శ్రీ సి.హెచ్.రామకృష్ణా రెడ్డి
హైదరాబాద్
రూ.3,88,000/-
(మూడు లక్షల ఎనభై ఎనిమిది వేలు)




శ్రీమతి జి.రమ్య
శ్రీ జి.వెంకటేశ్
హైదరాబాద్
రూ.3,00,000/-
(మూడు లక్షలు)




చైతన్య యువత
హైదరాబాద్
రూ.2,17,200/-
(రెండు లక్షల పదిహేడు వేల రెండు వందలు)



శ్రీ వి.వి.రమణా రెడ్డి
హైదరాబాద్
రూ.2,00,000/-
(రెండు లక్షలు)




శ్రీ ఎ.ఆర్.జయ కుమార్
కీళమంగళం
రూ.2,00,000/-
(రెండు లక్షలు)



సుందర సత్సంగ్
విశాఖపట్టణం
రూ.1,50,000/-
(లక్షా యాభై వేలు)




శ్రీమతి ఎమ్.పుష్పవతి
హైదరాబాద్
రూ.1,00,000/-
(లక్ష రూపాయలు)



శ్రీమతి యు.అమృత
శ్రీ యు.యాదయ్య
హైదరాబాద్
రూ.1,00,000/-
(లక్ష రూపాయలు)



శ్రీమతి రమాదేవి
భీమవరం
రూ.1,00,000/-
(లక్ష రూపాయలు)



సద్గురు సదనం
హైదరాబాద్
రూ.1,00,000/-
(లక్ష రూపాయలు)



శ్రీమతి కె.శ్రీదేవమ్మ
శ్రీ కె.రామచంద్రా రెడ్డి
ఆశ్రమం
రూ.1,00,000/-
(లక్ష రూపాయలు)



శ్రీమతి ఎ.భారతి
శ్రీ ఎ.రంగయ్య
హైదరాబాద్
రూ.1,00,000/-
(లక్ష రూపాయలు)



శ్రీమతి డి.రాములమ్మ
మహబూబ్‌నగర్
రూ.1,00,000/-
(లక్ష రూపాయలు)



శ్రీమతి సి.రాధ
శ్రీ సి.హెచ్.కృష్ణ
వైజాగ్
రూ.1,00,000/-
(లక్ష రూపాయలు)



శ్రీమతి కె.ప్రసూన
శ్రీ కె.కిశోర్
యు.కె.
రూ.1,00,000/-
(లక్ష రూపాయలు)



శ్రీమతి ఎ.యశోదా శర్మ
హైదరాబాద్
రూ.1,00,000/-
(లక్ష రూపాయలు)



శ్రీమతి డి.సురేఖ
అమెరికా
రూ.1,00,000/-
(లక్ష రూపాయలు)



శ్రీమతి బి.కామాక్షి
అమెరికా
రూ.1,00,000/-
(లక్ష రూపాయలు)


(సశేషం)



ఆచార్యులకు సన్మానం

శ్రీ సద్గురు పాదుకార్చన

హైదరాబాద్ - సుందర చైతన్యాశ్రమంలో శ్రీరామాలయ నిర్మాణానికి విరాళములు సమర్పించిన భక్తులు



స్వాధ్యాయ మాతృమండలి
హైదరాబాద్
రూ.78,000/-
(డెబ్బై ఎనిమిది వేలు)



శ్రీ బి.రమేశ్
హైదరాబాద్
రూ.60,000/-
(అరవై వేలు)




శ్రీ పి.నాగయ్య
మహబూబ్‌నగర్
రూ.54,000/-
(యాభై నాలుగు వేలు)



శ్రీమతి వి.నారాయణమ్మ
శ్రీ వి.జనార్దన్ రెడ్డి
హైదరాబాద్
రూ.51,151/-
(యాభై ఒక్క వేల నూట యాభై ఒకటి)



శ్రీమతి జి.చంద్రకళ
శ్రీ జి.కృష్ణమూర్తి
హైదరాబాద్
రూ.51,116/-
(యాభై ఒక్క వేల నూట పదహారు)



శ్రీ ఎ.రాములు
మహబూబ్‌నగర్
రూ.51,111/-
(యాభై ఒక్క వేల నూట పదకొండు)



శ్రీమతి బి.హైమావతి
శ్రీ బి.భాస్కర్
హైదరాబాద్
రూ.51,000/-
(యాభై ఒక్క వేలు)



శ్రీమతి వి.సుజాత
శ్రీ వి.రాములు
నిజామాబాద్
రూ.51,000/-
(యాభై ఒక్క వేలు)




శ్రీమతి డి.కల్పన
శ్రీ బాచి రెడ్డి
మహబూబ్‌నగర్
రూ.51,000/-
(యాభై ఒక్క వేలు)



శ్రీమతి కె.రంగలక్ష్మమ్మ
శ్రీ కె.సుబ్బారావు
కాగజ్‌నగర్
రూ.50,116/-
(యాభై వేల నూట పదహారు)




శ్రీమతి పి.రాధమ్మ
హైదరాబాద్
రూ.50,000/-
(యాభై వేలు)



చి॥ వై.సాయి సుదర్శన్ రెడ్డి
చి॥ వై.శ్యామచరణ్ రెడ్డి
హైదరాబాద్
రూ.50,000/-
(యాభై వేలు)



శ్రీమతి ఎమ్.మంగళ
హైదరాబాద్
రూ.50,000/-
(యాభై వేలు)




శ్రీమతి పావని
చి॥ త్రిపురాశ్రిత
చి॥ అద్వైత
హైదరాబాద్
రూ.50,000/-
(యాభై వేలు)



శ్రీమతి ఎమ్.చైతన్య
శ్రీ ఎమ్.సంతోష్ కుమార్
హైదరాబాద్
రూ.50,000/-
(యాభై వేలు)




శ్రీమతి కె.తులసీ బృందా దేవి
హైదరాబాద్
రూ.50,000/-
(యాభై వేలు)



డా॥ శ్రీమతి ఎస్.కస్తూరి
లండన్
రూ.50,000/-
(యాభై వేలు)



శ్రీమతి ఎమ్.విమల
శ్రీ ఎమ్.ఎల్.ఎన్.నాగేంద్ర కుమార్
హైదరాబాద్
రూ.50,000/-
(యాభై వేలు)




శ్రీమతి కె.గౌతమి
శ్రీ కె.రఘుపాల్
హైదరాబాద్
రూ.50,000/-
(యాభై వేలు)




శ్రీమతి పి.జ్యోతి
శ్రీ పి.బాలకేశవ రెడ్డి
హైదరాబాద్
రూ.50,000/-
(యాభై వేలు)

(సశేషం)


శ్రుతిమందిరంలో ఆవిష్కరణలు




క్యాలెండర్ - 2026




లడ్డూ ప్రసాదం




దారి దీపాలు పుస్తకం




నిత్య దర్శనం




జపమాల



గోదానం



చైతన్య యువత సన్మానం



సద్గురు పాదుకా దర్శనం

ఓ కథ చెప్పనా!

స్వామి సుందర చైతన్యానంద

జ్ఞాని వైభవం

పూర్వం అదొక రాజ్యం. రాజు గారికి లేక లేక ఒక పుత్రుడు వంశాంకురంగా జన్మిస్తాడు. ఆ బిడ్డకు అలంకరించి ఉన్న అమూల్యమైన రత్నహారాల కొరకు గజదొంగలు ఆ బిడ్డను అపహరిస్తారు. ఆభరణాలను దోచుకొని, ఆ పిల్లవాణ్ణి దూర ప్రదేశాలకు తీసుకువెళ్ళి వదిలేస్తారు.



పిల్లవాడు పెరుగుతూ పెరుగుతూ బిచ్చగాడు అవుతాడు. ఏకాకిగా జీవిస్తూ ఉంటాడు. ఒక గోచి పెట్టుకొని, అక్షయ పాత్రగా ఒక డబ్బాను చేత పట్టుకొని, భుజానికి జోలెను తగిలించుకొని, చిరిగిన బట్టను తలకు చుట్టుకొని, ఆకలేస్తే బిచ్చ మెత్తుకుంటూ, నిద్ర వస్తే చెట్టు క్రింద పడుకొని నిద్రిస్తూ ఉంటాడు.

ఐదు దశాబ్దాలు దొర్లి పోయాయి. రాజ్యంలో రాజు గారు మరణించారు. రాజు సంతతి వారే సింహాసనాన్ని అధిష్ఠించాలి అనేది ఆ రాజ్యంలో అనాదిగా వస్తున్న ఆచారము. రాజు గారికి కలిగిన ఒకానొక వంశాంకురం బాల్యం లోనే అపహరింప బడ్డాడు. పుట్టుమచ్చలతో సహా, బిడ్డ గురుతు లన్నీ చెప్పి, గూఢచారులను పంపి దేశ మంతా గాలించినా బిడ్డ లభ్యం కాలేదు.

ఇప్పుడేమో రాజు గారు మరణించారు. మంత్రిగారు నైష్ఠికుడు. వేదాధ్యయన తత్పరుడు. ఎంత ఆలోచించినా కర్తవ్యం బోధ పడలేదు. అన్యులను రాజ సింహాసనంపై కూర్చో పెడితే, రాజ్యానికి కీడు వాటిల్లుతుం దేమో నని మంత్రి గారి అనుమానం.

ఈ లోగా ఒక సాధు మహాత్ముడు ఆ రాజ్యానికి వచ్చాడు. మంత్రి వెళ్ళి ఆయన పాదాలపై పడి ప్రార్థించాడు. సాధు మహాత్ముని హృదయం ద్రవించింది. రాజకుమారుని జాడను దివ్య దృష్టితో తెలుసు కొనిన ఆ సాధు పురుషుడు, రాజకుమారుడు బిచ్చగాడై, ఉజ్జయినీ ఆలయ ప్రాంగణంలో తిరుగుతూ ఉన్నాడని చెప్పాడు.

ముఖ్యులను వెంట బెట్టుకొని మంత్రిగారు స్వయంగా ఉజ్జయిని చేరాడు. రాజకుమారుని గుర్తించాడు. ఆనవాళ్ళను బట్టి అతడే రాజకుమారుడని ఋజువైంది. మంత్రిగారు ఆనందంతో అతనిని రాజ్యానికి తీసుకొని వచ్చి, చదువుసంధ్యలు చెప్పించారు.

సంస్కరింప బడిన ఆ వ్యక్తిని ప్రజామోదంతో రాజును చేశారు. మంత్రిగారి సంరక్షణలో దినదిన ప్రవర్ధమానంగా ఎదిగి, రాజుగా అతడు గొప్ప కీర్తిప్రతిష్ఠలను ఆర్జించాడు. ఇలా కొన్ని సంవత్సరాలు గడిచి పోయాయి.

ఒకనాడు రాజు గారికి ఒక వింత ఆలోచన కలిగింది. ఉజ్జయినీ నగర వీధులలో సుమారు యాభై సంవత్సరాలు జీవించిన జీవన విధానాన్ని మరొక్కసారి, ఈ దశలో అనుభవించా లన్న కోరిక కలిగింది.

ఒక మాసం రోజులు తీర్థయాత్రా నెపంతో, రాజ్యాన్ని మంత్రి గారికి అప్పగించి, తాను కొందరు సన్నిహితులతో కలిసి బయలుదేరి ఉజ్జయిని చేరాడు. ఒక సత్రాన్ని అద్దెకు తీసుకున్నాడు. సహచరులను చుట్టు ప్రక్కల ఉన్న తీర్థక్షేత్రాలను దర్శించి రమ్మని పంపించి వేశాడు.

ఒకనాడు ఉదయాన్నే పూర్వపు వేషాన్ని ధరించాడు. గోచి పెట్టుకున్నాడు. జోలెను, డబ్బా నొక దానిని తగిలించు కున్నాడు. తలకు చిరిగిన పాత బట్టను చుట్టు కున్నాడు. నగర వీధుల లోకి బిచ్చగాడి లాగా ప్రవేశించాడు.

ఒక పూల కొట్టు ముందు నిలబడ్డాడు. పూల వర్తకుడు అతణ్ణి చూడగానే, 'ఇంతకాలం ఏమయ్యావు? రారా. ఇదిగో తీసుకో!' అంటూ కొన్ని నాణెములను ఇచ్చాడు. బిచ్చగాని రూపంలో ఉన్న రాజు ఆ డబ్బును అందుకొని దణ్ణం పెట్టి అక్కడ నుండి కదిలాడు. పూర్వం అన్ని నాణెములు లభిస్తే ఎంత సంతసించే వాడో! కానీ ఇప్పుడు మనస్సులో అలాంటి సంతోషమే లేదు.

మరొక అపరాల కొట్టు వద్దకు వెళ్ళగానే, ఇతడిని చూచిన వర్తకుడు బుసలు కొడుతూ, 'మళ్ళీ దాపురించావూ! ఉదయాన్నే నీ ముఖం చూశాను. ఇక ఈ రోజు బేరం పూజ్యమే' అంటూ దూషించాడు. అతని దూషణలను ఆలకించి మెల్లగా ముందుకు సాగి పోతాడు రాజు. అంతేగాని, మనస్సులో తిట్టిన వానిపై ద్వేషమే కలగదు.

మరొక వడ్డీ వ్యాపారి కొట్టు ముందు నిలబడ్డాడు రాజు. ఆ వడ్డీ వ్యాపారి అప్పుడే ఎవరితోనో కలహించి కలత చెంది ఉన్నాడు. బిచ్చగాణ్ణి చూడగానే, 'నికృష్టుడా! ఎక్కడ చచ్చావు ఇంతకాలం? మళ్ళీ నీ శనిగొట్టు ముఖాన్ని చూపడానికి వచ్చావా?' అని రెచ్చిపోతూ, కోపాన్ని ఆపుకోలేక బలంగా కొడతాడు. ఆ దెబ్బకు బిచ్చగాని రూపంలో ఉన్న రాజు తూలి క్రిందపడి, మెల్లగా లేచి, తన దారిన తాను పోతాడు. అంతే గాని, ఏ మాత్రం దుఃఖించడు. విచారించడు.

ఆ ప్రక్కనే ఒక నిత్యాన్నదాన సత్రం ఉంది. క్రొత్తగా ఉదారులు దానిని నెలకొల్పి ఉన్నారు. వారు గతంలో ఈ బిచ్చగాణ్ణి చూచి ఎరుగరు. వడ్డీ వ్యాపారి దుష్ప్రవర్తన నంతా చూచి బాధపడిన ఆ సత్రం యజమానులు అతనిని లోనికి తీసుకొని వెళ్ళి, ఓదార్పు మాటలు పలికి, భోజనం పెట్టిస్తారు. బట్టలు ఇస్తారు. కొంత డబ్బు కూడా ఇస్తారు. 'నాయనా! నిన్ను ఆ దుష్టుడు దుర్మార్గంగా బాధించాడు. అది మనస్సులో పెట్టుకోకు. వాడు అంతే.

నువ్వు ఇక వెళ్ళు. నీకు ఇంకేమైనా డబ్బు అవసరమా? నిస్సంకోచంగా అడుగు, ఇస్తాము' అంటారు. కానీ, రాజు వద్దని తల ఊపి, తన దారిన తాను వెళ్ళి, అద్దెకు తీసుకున్న సత్రానికి చేరి, దుస్తులు మార్చుకొని, ప్రశాంతంగా కూర్చుంటాడు. ఏదో అనిర్వచనీయమైన దివ్యానందంలో ఓలలాడుతూ ఉంటాడు. జరిగిన ఈ సన్నివేశాలలో శుభాశుభాలు అతనిని అంటవు. అతడు శుభాశుభాలకు అతీతుడు.

తాను బిచ్చగాడుగా తిరిగినా, అన్ని నాణెముల బిచ్చం లభించినా అతడు సంతసించలేదు. కోట్లకు అధిపతి యైన రాజు ఆ నాణెములకు సంతసిస్తాడా? **(న హృష్యతి).** వర్తకుడు నిష్కారణంగా నిందించినా ద్వేషం లేదు. తాను రాజు అని తెలిస్తే అతడు దూషిస్తాడా? అందుకని ద్వేషం లేదు **(న ద్వేష్టి).** తాను స్వతహాగా రాజై ఉన్నందున, కొట్టినా దుఃఖించ లేదు **(న శోచతి).** అన్నసత్రం వాళ్ళు ఆదరించి, ఇంకేమన్నా కావాల్సి ఉంటే అడుగు అంటే, పూర్వమైతే ఆశించే వాడేమో గాని, ప్రస్తుతం తాను మకాం ఉన్న సత్రంలో తన దగ్గరే విశేషంగా ధనం ఉండే టప్పుడు ఏమి కోరుతాడు? **(న కాంక్షతి).** తానేమిటో తనకు తెలిసి, కేవలం లీలా మాత్రంగా బిచ్చ మెత్తుకున్న రాజుగారు శుభాశుభాలకు ఎలా అతీతుడో, తన స్వరూప జ్ఞానమును కలిగి ఉన్న ఆత్మవిదుడు ఈ ప్రపంచంలో క్రీడా విలాసంగా చరిస్తూ ఉన్నా, అలౌకిక ఆనందానుభూతిలో ఓలలాడుతూ ఉంటాడు. ప్రపంచము, ప్రపంచం లోని సన్నివేశాలు జ్ఞానిని కదిలించ లేవు. అవి అతనికి స్వప్నతుల్యాలు. ప్రపంచమే విస్మృతప్రాయము. ఎవరి జ్ఞానము స్థిర మైనదో **(యస్య స్థితా భవేత్ప్రజ్ఞా),** ఎవరి ఆనందము నిత్య ప్రవాహమో **(యస్య ఆనందః నిరంతరః),** అట్టి జ్ఞానికి ఈ ప్రపంచము విస్మృతప్రాయము **(సః ప్రపంచః విస్మృత ప్రాయః).**

(11వ పేజీ తరువాయి)

గతానికి సంబంధించిన ఆవేదనలను మరచిపోవాలి. భవిష్యత్తుకు సంబంధించిన ఆలోచనలను అరికట్టాలి. వర్తమానంలో ఆందోళన లేకుండా, ఆవేశము రాకుండా జీవించ గలిగితే బ్రతుకు ధన్యమవుతుంది.

గతాన్ని గూర్చి ఆలోచనలు కదలగానే దృష్టి వర్తమానం వైపుకు మరలాలి. వర్తమానానికి సంబంధించిన కర్మలు ఆచరించాలి. అవేవీ లేకపోతే నిస్సంకల్ప స్థితిలో నిరామయంగా ఉండేందుకు ప్రయత్నించాలి. అప్పుడే నీవు సుఖించగలవు. గతాలు గతిని మూసేశాయి. భవిష్యత్తు ఇంకా బాటను తెరువలేదు. మనకు వెలుగు నిలిచి ఉన్నది వర్తమానం లోనే. దానిని వినియోగించుకొన్నప్పుడే మనము వినీతులము కాగలము. విమల చిత్తులము కాగలము.

సాధన సౌలభ్యానికి ద్వాదశ సోపానాలు

స్వామి సుందర చైతన్యానంద

(1) మనకు లేని దేమిటి? మనకు కావలసింది ఏమిటి? అనే రెండు ప్రశ్నలను ఎవరికి వారుగా తమపై సంధించుకొని వాటికి సమాధానాల్ని రాబట్టు కోవాలి. మనం పొంద దగినది, పొంద వలసింది మోక్షమే అని కనుక ఆంతర్యం చెబితే, మరి దానిని పొందే ప్రయత్నం మనం ఏమి చేస్తున్నాము? అని తిరిగి మనస్సును ప్రశ్నించుకోవాలి. ఒకవేళ, కావలసింది మోక్షము కాదు అనిపిస్తే, మరేది అవసరమో చెప్పమని ఆంతర్యాన్నే నిలదీయాలి.

ఏదో ఏదో పొందాలని ఆరాటపడే వారు ఏదీ పొందలేరు. మనకు కావలసిందేమిటో మనకు క్షుణ్ణంగా తెలిసినపుడే సాధన తేజోమయ మవుతుంది. ప్రయాణం సుగమ మవుతుంది.

ఒక వైపు ప్రారబ్ధ సాగరంలో పడి కొట్టుమిట్టాడుతూ ఉన్నా, పరమ పురుషార్థమైన మోక్ష సాధన వైపే మన దృష్టి కేంద్రీకృతమై ఉండాలి. ప్రతిబంధకాలను అర్థం చేసుకుంటూ పోతే అవి ప్రగతి నిరోధకాలు కాకుండా ఉంటాయి.

(2) ఇతరులు మీ సాధనకు అవరోధాలు కాకుండా చూసుకోండి. ఈ లోకంలో ఎవరు ఎలా ఆలోచించగలరో అలాగే ఆలోచిస్తారు. అలా ఆలోచించడం వెనుక నివారించడానికి వీలు లేని విధంగా నియతి ఉంది. అందుచేత ఒకరి ఆలోచనలను మరొకరు మోసుకుంటూ తిరగలేరు. ఒకరి మనస్సులో ఇమిడిపోయి మరొకరు జీవించలేరు. ఎవరు ఎలా ఉంటే అలా ఉండనివ్వండి.

(3) ఇతరులు నీ విషయంలో ప్రతికూలంగా ఉన్నంత మాత్రాన వారి వల్ల నీకు కష్టాలు కలుగుతాయేమో, మనుగడ మరోలా మారుతుందేమో అనే సందేహాలతో భయాలను పెంచుకో వద్దు. ఇలాంటి భయాలతో సాధనపరంగా ధ్యానం సాగదు. జ్ఞానపరంగా విచారమూ కొనసాగదు. ధ్యానం సాగకపోతే మనస్సుకు నిశ్చలత్వం రాదు. విచారం సాగక పోతే జ్ఞానం బుద్ధికి పట్టదు. నీ ఉన్నతిని మరొకరు పెంచనూ లేరు. నీ ప్రగతిని మరొకరు చెడగొట్టనూ లేరు. ప్రారబ్ధ ఫలాల విషయంలో నీకు సహకరించ గలవారు ఇద్దరే ఉన్నారు. ఒకడు గోవిందుడు. మరొకడు గురువు.

(4) ధ్యానానికి ప్రతిబంధకాలైన విషయాలను బుద్ధిలో పెట్టుకొని ధ్యానాన్ని కొనసాగించడం సాధ్య పడదు. గతంలో జరిగిన వన్నీ వాస్తవాలే. వాస్తవాల్ని అంగీకరించండి. జరిగి పోయిన వాస్తవాల విషయంలో మనం చేయ గలిగింది ఏమీ లేదు. గతాన్ని సంపూర్ణంగా అంగీకరించండి. అంతే. ఆ క్షణం నుండి హృదయం తేలిక పడుతుంది. ధ్యానం నిరాటంకంగా సాగుతుంది. విచారము నిరంతరము కొనసాగుతుంది.

(5) గతంలో జరిగిన బాధాకరమైన సన్నివేశాలను సంపూర్ణంగా అంగీకరించి, వాటికి కారణభూతులైన వారిని ఎలా క్షమిస్తున్నావో, అలాగే, ఒకవేళ అలాంటి సన్నివేశాలకు నీవే కారణమై ఉంటే, నిన్ను కూడా నీవు క్షమించుకొనే స్థాయిలో ఉండు. తప్పు చేసింది నా అజ్ఞానమే గాని నేను కాదు. నేను అకర్తనే గాని కర్తను గాను అనే ఆత్మ విచారంలో నిలిచిపో. గతాన్ని గతానికి విడిచి పెట్టేయ్.

(6) మన జీవితంలో జరిగే ఏ విషయాని కైనా పరమేశ్వరుని అనుమతి ఉందా, లేదా? జరిగినవి సంభవాలా, అసంభవాలా? అనివార్యాలు ఉంటాయేమో గాని అసంభవాలు ఉంటాయా? జరిగే ప్రతి సన్నివేశం వెనుక నియతి ఉంది. భగవంతుని అనుమతి ఉంది. భగవంతుడు అనుమతించి అందించిన ఫలాన్ని నిరాకరించే శక్తి మనకు ఉందా? మృత్యువు కూడా ఒక సన్నివేశమే. కర్మఫలమే. మన దుఃఖానికి కారణం ఏ సన్నివేశమూ కాదు. పరిమిత మైన జ్ఞానం కారణంగా సన్నివేశాలను అర్థం చేసుకోలేక పోవడమే దుఃఖానికి కారణము అనేది సదా స్మృతిలో ఉంచుకోండి.

(7) దేనిపై మమతను పెంచుకున్నా, అది బుద్ధిలో సమతను దెబ్బ తీస్తుంది. ఎవరిని అతిగా ప్రేమించినా అది జీవన యానాన్ని వక్రగతి వైపు నడిపిస్తుంది. ప్రేమ మంచిదే. అతిప్రేమే అనర్థదాయకం. స్నేహం మంచిదే. అతిస్నేహం (అభిస్నేహం) నిరర్థకం. అతిప్రేమలు సమస్యలకు శ్రీకారం చుడతాయి. సంతాపాలను పెంచి పోషిస్తాయి.

(8) ప్రపంచాన్ని గూర్చి అలసిపోయే టంతగా ఎందుకు ఆలోచిస్తావు? ఎంత మందిని గూర్చి ఆలోచిస్తావు? ఎందరిని నీ బుద్ధిలో ఇముడ్చుకో గలవు? వారందరూ నీవు ఆలోచించ దగిన వారేనా? ఈ ఒక్క ఆలోచన చక్కగా చేయ గలిగితే, అన్ని ఆలోచనలు ఆవిరై పోతాయి. ఆవేదన లన్నీ అడుగంటి పోతాయి. మిత్రమా! ఎవరిని గురించి గాని అదే పనిగా ఆలోచించడం మానేయ్. నువ్వు ప్రపంచాన్ని గూర్చి ఎంత అతిగా ఆలోచించినా, ప్రపంచం మాత్రం నిన్ను పట్టించుకోదు. నిన్ను గురించి ఆలోచించే స్థితిలో ఇతరులు లేరు. అర్థం చేసుకో.

(9) మొక్కల్ని పెంచినట్లు, కుక్కల్ని పెంచినట్లు కోరికల్ని పెంచుకోవద్దు. కోరికల్ని పెంచుకుంటూ పోతే అవి ఒక దశలో పెరిగి నాలుగు నలభై అవుతాయి - నాలుగు వందలూ అవుతాయి. ఆ దశలో అవి తీరే అవకాశం లేక, తీర్చుకొనే శక్తి మనకు లేక బ్రతుకు బండబారి పోతుంది. అలా కాకుండా, ఉన్న కోరికల్ని పెంచుకోకుండా త్రుంచుకుంటూ వస్తే, ఒక దశలో, తలపై మూటల్ని దించుకున్నట్లు తలలోని తలపుల్ని కూడా దించుకో గలుగుతాం. ఆ దశలో హృదయంలో ప్రశాంతతే రాజ్య మేలుతుంది.


(10) కాలం చాలా విచిత్ర మైంది. కాలం లోనే అన్నీ మారి పోతాయి. కాలం లోనే అన్నీ కారి పోతాయి. కాలం సాగేదే గాని ఆగేది కాదు. కాలానికి పనితనమే గాని కనికరము లేదు. కాలం తెలివైంది కాకపోవచ్చు. కాని, కాలం చాలా విలువైంది. దాని విలువెంతో తెలిసే లోగా కాలం కరిగి పోతుంది. కరుగుతూ కారిపోయే కాలానికి ఖరీదెంతో కాలం ఉన్నప్పుడే నిర్ణయించుకోవాలి. కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం లోనే మనం కాలాతీతులం కాగలము. కాలాన్ని దుర్వినియోగం చేసుకుంటే మళ్ళీ కాటిలో కాపురమే.

(11) ప్రాయశ్చిత్తాలు, పశ్చాత్తాపాలు జీవితాన్ని ప్రభావితం చేయవు. అవన్నీ బాధల గతాన్ని గుర్తు చేసి బాధించేందుకే ఉపకరిస్తాయి. మనిషి పొంగి పోయేందుకు, మనస్సు క్రుంగి పోయేందుకే పనికొస్తాయి. దురద ఉన్నవాడు దేహాన్ని గోకుతూ ఉంటాడు.

(33వ పేజీ చూడుము)

అనుగ్రహ వర్షం

స్వామి సుందర చైతన్యానంద



సూర్యాస్తమయంతో విశ్వంలో వెలుగులు ఆరిపోతాయి. చీకట్లు ముసురు కుంటాయి. ఇవి బాహ్య తిమిరాలు. బాహ్యంలో చీకట్లు ఉన్నంత మాత్రాన వ్యక్తి ఆంతర్యంలో అంధకారం ఉండ నవసరం లేదు. బాహ్యం లోని చీకట్లు మనల్ని బాధించవు. ఆంతర్యంలో చీకట్లు వ్యాపిస్తే బాహ్యంలో వెలుగు లున్నా వ్యక్తి గ్రుడ్డివాడు గానే మిగిలి పోతాడు. అస్తమించిన సూర్యుణ్ణి వెంటనే తీసికొని వచ్చి ఆకాశంలో ఉంచడం ఎవ్వరికీ సాధ్యం కాదు. కాని, హృదయాకాశంలో అస్తమించిన వెలుగుల్ని తిరిగి ఆవిష్కరించుకోవడం వివేకవంతులకు అసాధ్య మేమీ కాదు.

బాహ్యంలో ఒక్క వెలుగులే కావు; ఏవయినా మారుతూనే ఉంటాయి. ఒకే లాగ ఉండవు. అలాగని, వాటితో పాటు మనిషి కూడా తదనుగుణంగా మారుతూ పోతే, విశ్వంలో చీకట్లు వ్యాపించి నపుడు వాటి ప్రభావం మనస్సుపై కూడా ఉంటుంది. మనిషిపై ఉంటుంది. మనుగడే చీకటిమయ మవుతుంది. అది ఎంత దుర్భరమో ఆలోచిస్తే అర్థ మవుతుంది.

దుర్భర మైన మనస్సును కలిగిన దుర్బలులకు ధ్యాన మనేది దుర్లభం గానే ఉంటుంది. ధ్యాన మనేది పరమేశ్వరునికి సంబంధించి మనం సాగించే మానస వ్యాపారము. మార్పుల సంగీతానికి నాట్యం చేసే మనస్సు మార్పు లేని మహేశ్వరునిపై ఎలా ధ్యానం చేస్తుంది?

ధ్యానం చేయడానికి కొందరు పూజాగది లోకి వెళ్ళొచ్చు. కొందరు మందిరాలకు వెళ్ళొచ్చు. కొందరు వనప్రదేశాలకు పోవచ్చు. మరి కొందరు నదీతీరాలను చేరవచ్చు. ధ్యానం చెయ్యడానికి ఎవరు ఎక్కడికి పోతున్నారు? అనేది తెలియదగిన విషయం కాదు. కాని, ధ్యానం చేసే వారు అందరూ ప్రవేశించేది మనస్సు లోకే అనేది మాత్రం ధ్యాన యోగులకు తెలియవలసిన విషయం. విహారయాత్రలకు ఒంటరిగా వెళ్తే సుఖముండదు. కొందరితో కలసి వెళ్ళాలి. కాని ధ్యాన విహారానికి వ్యక్తి ఒంటరి గానే వెళ్ళాలి. అప్పుడే సుఖం. అందుకనే ఏకాంతమున **(రహసిస్థితః)** ఒంటరిగా **(ఏకాకీ)** ధ్యానాన్ని ప్రారంభించ మన్నాడు గీతాచార్యుడు. ఏ సహాయ మును లేనివాడుగా ఏకాకిని అభివర్ణించారు శ్రీ ఆదిశంకరాచార్య స్వామి **(రహసి స్థితః సన్ ఏకాకీ అసహాయః)**.

ధ్యానంలో అన్యుల సహాయము అవసరము లేదు. ఆదుకోవటానికి ఆలంబనంగా ఉండటానికి అచ్యుతుడు అక్కడ సిద్ధం గానే ఉన్నాడు. అదే ధ్యానవైభవము.

కొన్ని విషయాలలో ఇతరుల సహాయం మనకు అవసరం. కాని, ధ్యాన విషయంలో అన్యుల ప్రవేశము అనూహ్యము. పైగా ప్రతిబంధకము కూడా. మూటను తల పైకి ఎత్తడానికి ఇతరులు సహకరించాలి. శ్వాసలను ఆడించడానికి అన్యుల సహాయము మనకు అవసరమా? అక్కడ కూడా అతిప్రేమను కూడ గట్టుకొని అన్యులు ప్రవేశిస్తే, శ్వాసలు ఆడుతాయో,

ఆగుతాయో చెప్పలేము. ధ్యానం విషయంలో కూడా ఇతరుల ప్రమేయం ఇలాగే ఉంటుంది.

కనుక ధ్యానయోగి ఒంటరివాడుగా ధ్యానాన్ని కొనసాగించాలి. ధ్యానానికి ఏకాకిగా ప్రవేశించాలి. ధ్యానంలో ఏకాకిగా ఉండాలి. అంటే, తోడు ఎవరూ ఉండకూడదు. తోడు అనేది మనస్సుకు సంబంధించిన విషయ మని నేను ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదనుకుంటున్నాను. ఏకాకి మనస్సులో ఎవ్వరూ లేరు. లేకుండా ఉండాలి. సరే. వ్యక్తులు లేరు. విషయాలు ఉండవచ్చా? ఏ విషయాలు? వ్యక్తులకు సంబంధించిన విషయాలే కదా? వ్యక్తులు వేరు - విషయాలు వేరుగా ఉన్నాయా? విషయా లుంటే వ్యక్తులు ఉన్నట్లే. కనుక, ఏకాకి అంటే వ్యక్తులు, విషయాల నుండి విడిపడి యున్నవా డని అర్థం. అప్పుడే ధ్యానం సాగుతుంది. మనస్సును ధ్యానంలో నియమించడ మంటే ఇదే **(యోగీ నియత మానసః - నియతం సంయతం మానసం మనః యస్య సః అయం నియతమానసః).**

ఏ సహాయం లేకుండా, ఎవరి సహాయం లేకుండా తనలో తాను సుఖించడం తెలిసిన వాడు ధ్యానయోగి **(యోన్త సుఖోన్తరారామః).** తన ఆత్మ యందే తాను సుఖించు వాడు, రమించువాడు అని అర్థము **(యః అన్తః సుఖః ఆత్మని సుఖం యస్య సః అన్తః సుఖః, తథా అన్తః ఏవ ఆత్మని ఆరామః క్రీడా యస్య సః అన్తరారామః).** ధ్యానయోగి ఆత్మ యందే సుఖించేవాడు కావాలి. ఆత్మ యందే విహరించేవాడు కావాలి.

అలా ఉండాలి అంటే, బాహ్యవిషయాలు అతడిని బాహ్యానికి లాగకుండా ఉండాలి. బయట విషయాలు లోపలున్న వ్యక్తిని ఎలా లాగుతాయి? అవి లోపల ఉన్నప్పుడే లోపల సుఖించే వాణ్ణి బాహ్యానికి ఈడుస్తాయి. అలా జరుగకూడ దనేది అభిమత మైతే, బాహ్య విషయాలను లోనికి రానివ్వకుండా బాహ్యం లోనే ఉంచి యోగి ధ్యానంలో ప్రవేశించాలి. పాదరక్షలను గుడి బయట ఉంచి ఆలయం లోకి ప్రవేశించినట్లు, బాహ్య విషయాలను బాహ్యం లోనే ఉంచి ధ్యానం లోకి ప్రవేశించాలి **(స్పర్శాన్ కృత్వా బహిః బాహ్యాన్).**

కాళ్ళకు చెప్పుల్ని తొడుక్కుంటామే గాని చెప్పులకు కాళ్ళు లేవు. కనుక, ఎక్కడ మనం విడిస్తే, అక్కడే విడవకుండా పడి ఉంటాయి. కాని, విషయాలు వేరు. వాటికి రెక్క లున్నాయి. రెక్కల్ని ఆడిస్తూ గగన విహారం చేస్తాయి. హృదయాకాశం లోకి చొచ్చుకొని వస్తాయి. అప్పుడేమి చెయ్యాలి? ధ్యానంలో ధ్యానయోగి ఏదో చేసేవాడు కాడు. ఏదీ చేయకుండా ఉండేవాడు. చూస్తూ ఉండాలి. చేస్తూ ఉండకూడదు.

ఆకాశంలో ఎండ ఉంది; నువ్వు చూస్తున్నావు. వాన ఉంది; నువ్వు చూస్తున్నావు. గాలులు వీస్తున్నాయి; నువ్వు చూస్తున్నావు. వెన్నెల ఉంది; నువ్వు వీక్షిస్తున్నావు. ఇవన్నీ ఆకాశం లోనే తెలుస్తున్నాయి. ఇవేవీ లేక పోయినా ఆకాశము ఉంది. ఉంటుంది. వినిర్మలంగా ఉంటుంది. విశుద్ధం గానే ఉంటుంది. ఎండ తీవ్రంగా ఉంది. వర్షం భయంకరంగా కురుస్తోంది. గాలులు చల్లగా వీస్తున్నాయి; వెన్నెల మసకగా ఉంది - ఇలాంటి మాటలు వినిపిస్తా యేమో గాని, ఆకాశం బాగలేదు అని ఎవ్వరూ అనరు. ఆకాశం మీద

ఎవ్వరికీ అభియోగాలు లేవు; ఫిర్యాదులు ఉండవు. అందుకే అది ఆకాశం. అన్నిటికీ అవకాశ మిస్తూ **(అవకాశ ప్రదాతృ)** తన విషయంలో అవకాశ మివ్వని అద్భుతమే ఆకాశము. అందుకే నిరుపమాన మైన పరమేశ్వరుని ఆకాశం తోనే పోల్చారు **(గగన సదృశం).**

ఆకాశం వినిర్మలంగా ఉన్నట్లు ధ్యానయోగి ఆంతర్యం విశుద్ధంగా ఉండాలి. రాగాల వానలో నానకుండా, ద్వేషాల ఎండలో ఎండకుండా, ఈర్ష్యాసూయల చలిలో కుంచుక పోకుండా, వచ్చేవి వచ్చి పడుతున్నా, పోయేవి పరుగు లెత్తుతున్నా, తనలో ఏ చలనం, సంచలనం లేని ఆకాశం లాగా స్థిరమైన, నియతమైన మనస్సు ధ్యానంలో ఉండాలి. ఇక్కడే తనను తాను ప్రశాంతాత్మగా అనుభూతిని పొందడం జరుగుతుంది.

జరగ వలసినవి జరిగాయి. జరగకూడనివి జరగాలని ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. నియతి భగవత్స్వరూపము. దానిని అతిక్రమించడం ఎవరికీ సాధ్యం కాదు.

అవసర మనుకున్నవి దూరమై మన జీవితంలో వాటి అవసరాన్ని కుదించుకున్నాయి. ఇక అవి మనకు అవసరం లేనివి అని మదింపు వేసుకోవాలి. ఉండలేనివే పోతున్నాయి. పారి పోతున్నాయి. ఉండి వెలిగినవే ఉండలేక ఆరి పోతున్నాయి. ఉన్న మనస్సులే మారి పోతున్నాయి. కలసి ఉండలేక కారి పోతున్నాయి. పోయేందుకే వచ్చిన దేహాలు బలహీన పడిపోతున్నాయి. అన్నిటిలో నియతి ఉంది. నియతిరూపంలో నియంతే ఉన్నాడు. అర్థం చేసుకుంటే ఏదీ ధ్యానానికి అవరోధము కాదు. అర్థం కానపుడు మనకు మనమే అవరోధం. మన మనస్సే మనకు పెనుభూతం. ధ్యానంలో భూతాలు లేవు. భవిష్యత్తులు మిగలవు. అక్కడ అంతా వర్తమానమే. పరమేశ్వరుని వర్తమానాన్ని ఆలకించడమే. అది కరుణాపూరితమైన తొలకరి. ఆ తరువాత, అంతా వర్షమే. జ్ఞానవర్షమే. ఆచార్యుని అనుగ్రహవర్షమే. **ఓం.**

(30వ పేజీ తరువాయి)

పశ్చాత్తాప పడేవాడు మనస్సును గోకుతూ ఉంటాడు. ఒక దశలో దానిని మానని పుండుగా మార్చుకుంటాడు. పశ్చాత్తాపాలను ప్రక్కన పడేసి తప్పిదాల నుండి పాఠాలు నేర్చుకొనే అధ్యయన లక్షణాన్ని అలవరచు కోవాలి. పశ్చాత్తాపాలు, ప్రాయశ్చిత్తాలు పునః పాప జీవనానికి శ్రీకారం చుట్టే ప్రమాదం లేక పోలేదు. పాఠాలు నేర్చుకున్నప్పుడే బ్రతుకు ప్రభావిత మవుతుంది, ప్రవర్తన పరివర్తన వైపు అడుగులు వేస్తుంది.

(12) నిద్ర లేవగనే బ్రతుకును భగవంతునితో ఆరంభించండి. ***'కరాగ్రే వసతే లక్ష్మీః'*** *అనే శ్లోకాన్ని పఠిస్తూ,* ***'కరమధ్యే తు గోవిందః'*** *అంటూ అరచేతిలో అచ్యుతుని దర్శించండి. 'భగవాన్! నా చేతలు నా చేతుల్లో ఉంటే ఏ ప్రమాదమైనా జరగవచ్చు. బ్రతుకు భగవన్మయం కావాలంటే, నా చేతలన్నీ నా చేతిలో ఉన్న నీ ఆజ్ఞలకు లోబడే ఉండాలి. నీవు నడిపినట్లే నడవాలి. భగవాన్! ఈ రోజు నాది కాకుండా నీది కావాలి' అంటూ మనల్ని మనం పరమేశ్వరునికి సమర్పించుకోవాలి'.*

(20వ పేజీ తరువాయి)

ఒకనాడు పది ఆవులను ఇచ్చి వాటిని అడవిలో మేపి వంద ఆవులు అయిన తరువాత తిరిగి రమ్మన్నాడు గురువు. సత్యకాముడు అలాగే తిరిగి వచ్చాడు. కోటిసూర్య తేజస్సుతో, బ్రహ్మ వర్చస్సుతో సాక్షాత్తు పరమేశ్వర స్వరూపంగా వెల్గొందుతూ, 'గురుదేవా! ఆ పరబ్రహ్మ తత్త్వాన్ని నాకు బోధించు' అని భక్తితో వేడుకున్న సత్యకాముడికి గురువు తత్త్వమసి మహావాక్యం ద్వారా 'అది నీవు అయ్యే ఉన్నావు' అనే సత్యాన్ని బోధించి తరింప జేశాడు.

ఏ రాతిని ఏ విధంగా మలచాలో శిల్పికి తెలుసు. ఏ శిష్యుడిని ఏ విధంగా తరింప చేయాలో గురువుకు తెలుసు. ముందు గురు హృదయాన్ని గెలుచుకోవాలి. ఆ తరువాత బోధించ మని అడగాలి. అర్హత లేకపోతే గురువు అడిగినా చెప్పడు. అర్హత ఉన్నా అడగక పోతే చెప్పడు. గురువు తనకై తాను బోధించడు. ఎందుకని? గురువు దృష్టిలో అజ్ఞానమే లేదు కనుక. సూర్యుడు ప్రసరించిన చోటల్లా వెలుగే తప్ప చీకటి లేనట్లు, తన స్వరూపాన్ని సర్వత్ర దర్శించే గురువుకు అజ్ఞానం ఎక్కడా కనిపించదు. కనుక శిష్యుడు గురువును అడగాలి. ఏమని?

సాధనం యాచతే

స్వామిన్! నమస్తే! నత లోకబన్ధో కారుణ్యసింధో! పతితం భవాబ్ధౌ
మా ముద్ధ రాత్మీయ కటాక్ష దృష్ట్యా ఋజ్వాతి కారుణ్య సుధాబ్ధి వృష్ట్యా ॥

'స్వామీ! నమస్తే! నమ్రతతో జీవించు వారికి బంధువు నీవు. కరుణా సముద్రుడవు. నీ ప్రేమ అవధులు లేనిది. మరి నేను? జన్మ జరా రోగ మరణాదులనే అనర్థ సంకులమైన సంసార సాగరంలో పడి మునిగి పోతున్న వాణ్ణి. నీ కటాక్ష వీక్షణంతో ఈ సంసార సాగరం నుండి నన్ను ఉద్ధరించు. బంధ నివృత్తిని కలిగించు. సంసార దుఃఖాన్ని తొలగించు' అని ప్రార్థించాలి. దాని ఫలితం?

ఉపాయం నిర్దిశతి

అస్త్యుపాయో మహాన్ కశ్చిత్ సంసార భయ నాశనః
తేన తీర్త్వా భవాంభోధిం పరమానంద మాప్స్యసి ॥
వేదాంతార్థ విచారేణ జాయతే జ్ఞాన ముత్తమం
తేన ఆత్యంతిక సంసార దుఃఖనాశో భవత్యను ॥

రోగి దుఃఖ పడుతూ వైద్యుడి దగ్గరకు వెళితే, వైద్యుడు రోగితో కలిసి దుఃఖపడడు. అలాగే భవరోగంతో శిష్యుడు గురువును సమీపిస్తే, భిషగ్వరుడైన గురువు శిష్యుడితో కలిసి దుఃఖపడడు. **మా భైష్ట విద్వన్ తవ నాస్త్యపాయః సంసారాబ్ధే తరణేస్త్యుపాయః** 'సంసార భయం నీకు లేదు. సంసార సాగరాన్ని దాటే ఉపాయం ఉంది. భవరోగానికి నా వద్ద మందు ఉంది' అని గురువు శిష్యుడికి అభయం ఇస్తాడు. వాక్యవిచారం ద్వారా బ్రహ్మానందాన్ని పొందే ఉపాయం చెబుతాడు. వేదాంత వాక్యార్థ విచారం ద్వారా సంసార దుఃఖం సమూలంగా నశించి పోతుంది అని వాగ్దానం చేస్తాడు. ఆయన వాగ్దానమే మోక్షదానం. ఎందుకని? మోక్షం వాక్కు లోనే ఉంది కనుక. ఈ విధంగా ఆషాఢంలో గురుముఖతః చేసిన శ్రవణమే శ్రావణంలో గోవిందుని దర్శింప చేస్తుంది. అదే కృష్ణాష్టమి. శిష్యుడి హృదయంలో శ్రీకృష్ణజననం.

అక్షర కుసుమ పరాగం

శ్రీ జి.వెంకటేశ్వర్లు
తెలుగు లెక్చరర్, నల్లగొండ

పుడమి తల్లి పులకరించిన వేళ
ప్రకృతి కాంత పరవశించిన వేళ
దేవుని అంశంగా
జీవుని వంశంగా
భువిని అవతరించిన ఈ కవిభోజుడు రవితేజుడు!

అజ్ఞాన తిమిరంలో కూరుకున్న కూపస్థ
మండూకాలకు
దీపస్తంభంలా నిలిచిన ఓ దినకరా!
దీనజనులను బ్రోచే ఓ అభయంకరా!
ఓ మానవాళి వరమా! మా నివాళి గొనుమా!



కొడిగట్టిన దీపంలా రెపరెప లాడుతున్న
సనాతన ధర్మజ్యోతికి
మీరే వత్తిగా మారి, కత్తిలా చెలరేగి
భక్తినీ, ఆ భక్తిలోని రక్తినీ, శక్తినీ
చిత్తమునకు మత్తుగా హత్తుకునేలా
మీ వలె వ్యక్తీకరించుట అనితర సాధ్యం!
అనన్య సామాన్యం!

మన ఆచారాలను, ఆచార్య లందించిన
సమాచారాలను
యోచనతో విచారణ చేసి
జీవన తీరాలుగా
బ్రతుకు దారాలుగా, ఆధారాలుగా
అమృతధారల్లో చిలికించి, పలికించి, ఒలికించి
మా అంచనాలను మించి
మురిపించి, మరిపించిన విరించి విపంచి మీరు!

బ్రతుకు పారిపోయినా
భగవంతుడు జారి పోకూడదని
వెలలేని రీతిలో, వెలితి లేని రీతిలో
ఇలవేల్పుని కొలవాలని, తలవాలని

అలవోకగా సెలవిచ్చిన జ్ఞాన సెలయేరు మీరు!


వేదాంత తత్త్వాన్ని
ఉపనిషత్తుల మహత్త్వాన్ని
చిత్ర విచిత్రాలుగా
మాటలుగా, పాటలుగా
కాదు - కాదు, పూదోటలుగా ప్రవచించుటలో
మీకు మీరే సాటి
మరెవ్వరూ లేరు మీకు పోటీ.

వెలితిని తొలగించుకొని వెలుగును నింపు కోవాలని
దేహభావనను దైవంలో విలీనం చేసుకోవాలని
భగవంతుడే కొంగు బంగారమని
ముందుగా నిన్ను నీవు తెలుసు కోవాలని
అప్పుడే జీవికి మోక్షమని
దయా వీక్షణంతో, భక్ష్యాల వంటి సాక్ష్యాలతో
పరిపరి విధాల నిరూపించి
ఈ లోకంలో, ప్రజానీకంలో
ఏకంగా, అనేకంగా
అర్థం కానిది వేదాంతమని చెప్పుకొనే పిచ్చిభ్రమను
విభ్రమం చేసి
మీ వాణిని నిత్యసత్యంగా
మీ బాణిని ఆణిముత్యంగా
వినిపించిన కాంతి మీరు! దాంతి మీరు! సిద్ధాంతి మీరు!



ఇలా ఇలా, కలలో, మెలుకువలో
గుండె గుండెను కరిగించి
పిండి చేసిన ఓ కలకండా!
ఇక నుండి మీరే మాకు కొండంత అండ!
అందుకే నండి నా ఈ అక్షరాల దండ!

మా గుండె తలుపులను తెరచుకొని
మీ తలపులనే తలచుకొని
పరమాత్మను చేరేందుకు ప్రయత్నిస్తాము మహాత్మా!
ఆశీర్వదించు ఓ పరమాత్మా!



శ్రీ డి.వి.ఎన్.మల్లికార్జున శర్మ

చైతన్య రామాలయం

శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానంద సద్గురుదేవులు తే.**23-12-2025** ది నుండి **25-12-2025** వరకు మూడు రోజుల పాటు జాతీయ సుందర సత్సంగ సదస్సును వాత్సల్యంతో అనుగ్రహించారు. పూజ్య గురుదేవుల 78వ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని సర్వజ్ఞ కల్చరల్ ట్రస్టు వారు హైదరాబాదు సుందర చైతన్యాశ్రమంలో ఈ జాతీయ సదస్సును అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. సుమారు నాలుగు వేల మంది ప్రతినిధులు సదస్సుకు దేశ విదేశాల నుండి హాజరయ్యారు.

పూజ్య గురుదేవుల దివ్య సంకల్ప ఫలముగా శంకుస్థాపన జరిగిన నాటి నుండి కేవలం రెండు నెలల వ్యవధిలో సర్వాంగ సుందరమైన శ్రీ బాల రామ, శ్రీ భక్తాంజనేయ స్వామి వార్ల ఆలయాలు శ్రుతిమందిరం ప్రక్కనే నిర్మితమైనాయి! ఇది ఒక అద్భుతం.

ఇక రెండవ అద్భుతం : సదస్సు జరిగిన ప్రతి పూట పూజ్య గురుదేవులు రెండు గంటలు తక్కువ కాకుండా అనర్గళంగా ప్రవచనాలు అనుగ్రహించడం.

అందరికీ ఆనంద దాయకాలైన ఈ రెండు విశేషాలతో పాటు ఆశ్రమ ప్రాంగణమంతా పరచుకొన్న అత్యంత ఆహ్లాదకరమైన పరిసరాలు, వాతావరణం! ప్రతి ఆలయం చుట్టూ తమ బాటల వెంట రంగురంగుల పూల మొక్కలు, సిమెంటు రోడ్ల పైన కూడళ్ళలో మందిర ప్రాంగణాల్లో రంగురంగుల రంగవల్లులు, భవనాల పైన, ఆలయాల పైన రంగుల విద్యుద్దీపాలు, అడుగడుగునా పూజ్య గురుదేవుల సూక్తులను ప్రదర్శించే బిల్ బోర్డులు, డిజిటల్ సిగ్నేజ్ డిస్ప్లే కియోస్కులు - వీటన్నిటితో పాటుగా ఆశ్రమమంతటా నిరంతరాయంగా వినవచ్చే పూజ్య గురుదేవుల గాత్ర మాధురి 'శ్రీరామ జయ రామ జయ జయ రామ' అనే దివ్య మంత్రం.

'అభినవ బృందావనం - సుందర చైతన్యాశ్రమం' అంటూ ఇప్పటికే యూట్యూబ్‌లో చాలా రీల్స్ వచ్చాయి. దివ్యానుభూతిని కలిగించే ఈ ఆశ్రమాన్ని దర్శించ వచ్చే సందర్శకుల సంఖ్య దినదినాభివృద్ధి చెందుతోంది.

సదస్సు ప్రారంభం అయ్యే రోజు పూజ్య గురుదేవులు 'వాణీ చైతన్యం' నుండి శ్రుతిమందిరానికి, వేదమంత్రాలతో పూర్ణకుంభ స్వాగతంతో, మంగళ వాద్యాలతో, పుష్పాలంకృత దివ్య రథారూఢులై, బాటకు ఇరువైపుల చైతన్య యువత ఆశ్రమ లోగోను, పూజ్య గురుదేవుల చిత్రాన్ని ప్రదర్శించే పట్టు పతాకములను చేత బట్టి కోదండ రాముని చిత్రాన్ని **'రామో విగ్రహవాన్ ధర్మః'** అని లిఖించబడిన దుస్తులను ధరించి ఆహ్వానిస్తుండగా, వివిధ సుందర సత్సంగ సభ్య సమూహాలు నృత్య గీతాలతో స్వాగతాలు పలుకుతుండగా శ్రుతిమందిర ప్రాంగణం చేరి, అక్కడ ప్రణవ పతాకావిష్కరణ గావించి సదస్సును లాంఛనంగా ఆరంభించారు.

ముందుగా డా॥ సి.హెచ్.మోహనరావు గారు, డా॥ టి.నందకుమార్ గారు, డా॥ అశోక్ గారు పూజ్య గురుదేవులను పుష్పమాలాలంకృతులను గావించారు.

శ్రీ వి.వి.ఎస్.సీతారామం గారు సదస్సుకు హాజరైన ప్రతినిధులకు, భక్తులకు స్వాగతం పలికారు. అనంతరం సర్వజ్ఞ కల్చరల్ ట్రస్టు సభ్యులు శ్రీమతి సి.పద్మ గారిని వేదిక పైకి ఆహ్వానిస్తూ ప్రసంగించమని కోరారు.

ముఖ్యంగా గురు వైభవం గురించి, ఆశ్రమంలో నిర్మాణమైన రామాలయం గురించి ఆ పుణ్య కార్యంలో పాల్గొన్న శిష్యుల భక్తి శ్రద్ధల గురించి శ్రీమతి పద్మ గారు వివరించారు.

అనంతరం పూజ్య గురుదేవుల అనుగ్రహ భాషణం. సదస్సులో ఇది మొట్టమొదటి ప్రవచనం. ఇటువంటి ప్రవచనాలు మరో మూడు ఈ సదస్సులో పూజ్య గురుదేవులు అనుగ్రహించారు. అనగా, ఈ సదస్సులో పూజ్య గురుదేవులు సుమారు ఎనిమిది గంటలు భాషించారు. శ్రోతల ఆనందానికి అవధులు లేవు.

ప్రతి ప్రవచనానికి ప్రారంభం లోను, ముగింపు లోను రామ, కృష్ణ భజనలు. ప్రతి ప్రవచనం ఒక గంగా ప్రవాహంలా వేగవంతం గాను, లోతైన భావపూర్ణం గాను వేద వాఙ్మయం నుండి చైతన్య గానాల వరకు వివిధ ప్రమాణాల సమన్వితమై, పురాణేతిహాసముల లోని ఆఖ్యాయికలతో అద్భుతంగా సాగింది. ఇక నాల్గవ ప్రవచనంలో, గురుదేవులే స్వయంగా చెప్పినట్లు 'ఇది ఒక జ్ఞానయజ్ఞమా!' అన్నట్లు ఈ ప్రవచనాలు శోభించాయి.

'మనం ఎవరికి ఎదురు పడినా లేక ఎవరు మనకు ఎదురుపడినా 'ఏమండీ, బాగున్నారా' అని అడుగుతాము. ఎందుకంటే బాగుండడం అనేది అలా అడిగినంత సులభం కాదు. . . ' అంటూ ప్రారంభమైన తొలి ప్రవచనం నుండి నాల్గవ ప్రవచనం శాంతి మంత్రం వరకు అంతర్లీనంగా ప్రయాణం చేసిన విషయమంతా వేదాంత విజ్ఞానమే!

జీవుడు జన్మించి జీవనం సాగించి, చివరకు మరణించే వరకు ఇటు తాను జీవిస్తున్న పిండాండంలో గాని, అటు బ్రహ్మాండంలో గాని ఏ ఒక్క అంశం మీదా తనకు సంపూర్ణ నిర్ణయాధికారం లేని పరాధీనతతోనే జీవితాలు సాగిపోతాయి. కనుక ఈశ్వరత్వం కలిగి

నియంతగా సర్వాన్ని నడిపే శక్తిని భక్తి-జ్ఞాన సముపార్జన ద్వారా అవగాహన చేసుకునే ప్రయత్నము మాత్రమే జీవుని ముందున్న ప్రధాన కర్తవ్యం. అది ధర్మ జీవనం వల్లనే సాధ్య మవుతుంది కనుక ధర్మరూపుడైన దైవాన్ని సంపూర్ణ శరణాగతితో ఆశ్రయించడమే జీవుని ప్రగతి పథంలో నడిపించే ఏకైక సాధన. ఆ సాధనకు సంపూర్ణంగా సహకరించే సామగ్రిలో ఒక ముఖ్య అంశం ఆలయ వ్యవస్థ. ఆ వ్యవస్థను అందుబాటులో ఉంచే కార్యక్రమమే ఈ చైతన్య రామాలయ నిర్మాణం. బహుముఖ ప్రణాళికతో, నిబద్ధతతో ఆరు దశాబ్దాలుగా కొన్ని లక్షల మందిని ప్రభావితం చేసి ఈ సాధనా మార్గంలో నడిపిస్తున్న ఉద్యమమే పూజ్య గురుదేవులు **60** ఏళ్ళుగా శ్రమించి తెచ్చిన నిశ్శబ్ద విప్లవం.

ఇన్ని ఆలయ నిర్మాణాలు, ఇన్ని వేల పుటల గ్రంథ రచన, ఇన్ని వేల గంటల ప్రవచనాలు, ఇన్ని వందల భజనలు, గాన గాంధర్వాలు, గిరిధారి పత్రికా వ్యాస రచనలు, సంపాదకీయాలు, ఇంకా ఎన్నో రూపాల్లో జనాన్ని జాగృతం చేసే సాధనలు, వీటన్నిటినీ ప్రతిబింబిస్తూ, చేరువ చేస్తూ, పరిచయం చేస్తూ, ప్రచారం గావించే జ్ఞానయజ్ఞాలు. . . ఇవన్నీ ఆ నిశ్శబ్ద ఆధ్యాత్మిక విప్లవ ఫలితాలు. మానవమాత్రులకు ఇదంతా అసాధ్యమని అందరికీ అర్థమయ్యేదే! దాన్నంతా సుసాధ్యం చేసి చూపిన కారణజన్ములు, అవతార పురుషులు పూజ్య గురుదేవులు. ఇంతటి ఫలితాలు సాధించడం వెనుక ఎంతటి కఠోర శ్రమ, బాధలు, అనుభవాలతో పాటు భగవత్కృప ఉన్నవో స్వీయ చరిత్ర సాక్షిగా వివరించినది నాల్గవ ప్రవచనం.

స్థూలంగా చూస్తే, పూజ్య గురుదేవుల మొదటి ప్రవచనం మిగిలిన వాటికి పునాది వంటి ఉపోద్ఘాతం అనుకుంటే, రెండవ ప్రవచనం భాగవత (రామ), తత్త్వబోధ, మూడవ ప్రవచనం కూడా భాగవత (హనుమ), తత్త్వబోధ కాగా, నాల్గవ ప్రవచనం ఈ మూడిటివ సమాహారమైన పూజ్య గురుదేవుల సాధన దశ నుండి సిద్ధి దశ వరకు సాగిన ఆత్మ కథాత్మకం!

మొత్తంగా **2025** డిసెంబరు సుందర సత్సంగ జాతీయ సదస్సు ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక అనుభవం అని భావించవచ్చు.

'శ్రీరామ ప్రభువు' ఆలయ ఆవిష్కరణ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు సంబంధించిన ప్రతి అంశం పూజ్య గురుదేవుల ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహింపబడింది. పూజ్య గురుదేవులు విశ్వశాంతి హోమము నిర్వహించే ఋత్విక్కులకు త్రయాహ్నిక దీక్షకు, దీక్షా వస్త్రాది హోమ ద్రవ్యాలను ఆశీః పూర్వకంగా అనుగ్రహించారు. **23-12-2025** మంగళవారం నాడు ఆరంభమైన విశ్వశాంతి యాగము నందు గణపతి పూజ మొదలు **25-12-2025** గురువారం నాటి పూర్ణాహుతి వరకు ప్రతి అంశము శాస్త్రోక్తంగా నిర్వహించ బడింది.

శ్రీ బాలరామ మరియు శ్రీ భక్తాంజనేయ స్వామి వార్ల మూర్తుల ప్రతిష్ఠకు పూర్వం

జరుపవలసిన జలాధివాసం మొదలు శయ్యాధివాసం వరకు సమస్త అధివాసములు, శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకాది వివిధ ప్రక్రియలు, ప్రథమ పూజాధికలు, ప్రథమ దర్శనము మరియు సర్వ దర్శనము 25వ తేది పూజ్య గురుదేవుల జయంత్యుత్సవములో అంతర్భాగముగా ఎంతో వైభవోపేతంగా జరుపబడినవి.

సదస్సు మొదటి రోజు సాయంత్రం డా॥ ప్రసన్న గారు, డా॥ శశిధర్ గారు, డా॥హిమగిరి గారు పూజ్య గురుదేవులను పుష్పమాలాలంకృతులను గావించారు. అదే సాయంత్రం ప్రవచనం అనంతరం పూజ్య గురుదేవులు 2026 ఆశ్రమ క్యాలెండరును ఆవిష్కరించి, మొదటి కాపీని శ్రీ ఈశ్వరాచారి గారికి అనుగ్రహించారు.

తదుపరి 'చైతన్య భగవద్గీత - 4' (ఆంగ్లానువాదం) ను ఆవిష్కరించి, ప్రతులను అనువాదకులు శ్రీ హృషీకేశ్ శర్మ గారి సతీమణి శ్రీమతి యశోదాశర్మ గారికి, కుమార్తెలు శ్రీమతి సురేఖ, శ్రీమతి కామాక్షి గార్లకు పూజ్య గురుదేవులు అనుగ్రహించారు.

సదస్సు రెండవ రోజు ఉదయం డా॥ మదన్ మోహన్ గారు, శ్రీ నిరంజన్ గారు పూజ్య గురుదేవులను పుష్పమాలాలంకృతులను గావించారు. ప్రవచనం అనంతరం పూజ్య గురుదేవులు 'దారిదీపాలు' అనే ఎనభై పేజీల పుస్తకాన్ని ఆవిష్కరించి, మొదటి ప్రతిని శ్రీమతి భూదేవి గారికి అనుగ్రహించారు.

తరువాత జపమాల (ఎలక్ట్రానిక్)ను పూజ్య గురుదేవులు ఆవిష్కరించి మొదటిగా శ్రీ చంద్రశేఖర్ దంపతులకు (నిజామాబాద్) అనుగ్రహించారు.

లడ్డూ ప్రసాదాన్ని (పెట్టె సహా) పూజ్య గురుదేవులు ఆవిష్కరించి, ముందుగా శ్రీమతి గీతా వైకుంఠం దంపతులకు అనుగ్రహించారు. అనంతరం 2026 సంవత్సర 'నిత్య దర్శనం'ను ఆవిష్కరించారు.

24వ తేది సాయంత్రం పూజ్య గురుదేవులు, ఆశ్రమ ప్రధాన దైవతము శ్రీమురళీకృష్ణ స్వామి వార్లు విశేషముగా పుష్పాలంకృతమైన, సమున్నతమైన దివ్య రథారూఢులై ఆశ్రమ ప్రవేశ ద్వారము నుండి వాణీ చైతన్యం వరకు ఉత్సవంగా విహారం గావిస్తూ భక్తులను ఆశీర్వదించారు.

25వ తేది ఉదయమే పూజ్య గురుదేవుల 78వ జయంతి ఉత్సవాలు మంగళవాద్య ఘోష్ఠితో ఆరంభమైనవి. వేదోక్త పూర్ణకుంభ స్వాగతము సహా చైతన్య యువత, సుందర సత్సంగ సభ్యుల నృత్య గాన విశేషాలతో, నెమలి నృత్యాలతో, భజనలతో, భక్తులంతా స్వాగతం పలుకగా, పూజ్య గురుదేవులు పుష్పాలంకృతమైన హంస వాహనంపై వాణీ చైతన్యం నుండి శ్రుతిమందిరం వరకు ఉత్సవంగా ఆశీస్సులను అనుగ్రహిస్తూ కనువిందు చేశారు.

వేదికపై పూజ్య గురుదేవులను డా॥ శ్రీనివాస రెడ్డి గారు (మహబూబ్‌నగర్)

పుష్పమాలాలంకృతులను గావించారు. డా॥ టి.నందకుమార్ గారు (కాలిఫోర్నియ, అమెరికా) ముందుగా మాట్లాడుతూ, పూజ్య గురుదేవులు ఇన్ని లక్షల మందిని ప్రభావితం చేసి సన్మార్గంలో నడిపించడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగించే విషయమని, ఆ సంతోషాన్ని ఈ ఉత్సవాల్లో అందరితో కలిసి పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ సదస్సుకు వచ్చామని తెలియజేశారు.

అనంతరం వేద పండితులు బ్రహ్మశ్రీ కొండూరి రామసుబ్రహ్మణ్య శర్మ (రామం) గారు పూజ్య గురుదేవుల పాదుకార్చనను సంకల్ప శ్రీ సద్గురు అష్టోత్తర శతనామ పూర్వకంగా నిర్వహించారు.

అనంతరం శ్రీ సద్గురు సన్మాన కార్యక్రమం ప్రారంభమైంది. నిర్మల్ సత్సంగ్ పక్షాన శ్రీ కిషన్, శ్రీ సత్యనారాయణ వారి కుటుంబ సభ్యులు; శ్రీ మధుసూదన్, శ్రీమతి గీతా వైకుంఠం (బెంగుళూరు); చి॥ కృష్ణ చైతన్య, చి॥ ప్రమీలా ప్రియదర్శిని (నిర్మల్); చి॥అశోక్, రమ (పెండల్వాడ, ఆదిలాబాద్); శ్రీ నరేశ్ (అర్మూర్), శ్రీ కృష్ణానంద (ఆదిలాబాద్); శ్రీ వి.వి.రమణారెడ్డి దంపతులు (హైదరాబాద్); చైతన్య యువత; మోక్షధామం సభ్యులు పూజ్య గురుదేవులను ఫల పుష్ప మధుర పదార్థ నూతన వస్త్ర , స్వర్ణ అంగుళీయకాది ద్రవ్య సమర్పణతో అర్చించి ధన్యులయ్యారు.


భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థాన ప్రముఖ అర్చకస్వామి శ్రీమాన్ శ్రీ కోటిరామ స్వరూపాచార్యుల వారు భద్రాచల ఆలయ సంస్థాన పరంపరను అనుసరించి పూజ్య గురుదేవులను జన్మదినోత్సవ సందర్భంగా ప్రత్యేకంగా సన్మానించి ఆశీస్సులను పొందారు.

అనంతరం పూజ్య గురుదేవులు వేదపండితులైన విశ్వశాంతి యాగ ఋత్విక్కులు, శ్రీ రామం గారిని, వారి సోదర, బృందాన్ని పేరు పేరునా సత్కరించి ఆశీర్వదించి అనుగ్రహించారు.

పూజ్య గురుదేవుల పవిత్ర కరకమలముల మీదుగా ఆవిష్కృతమైన శ్రీరామ ప్రభువు ఆలయాన్ని, అభిముఖంగా నెలకొన్న శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకుని, యాగశాలను, గురుపాదుకలను సందర్శించుకుని, పూజ్య గురుదేవులు ఆశీః పూర్వకంగా అనుగ్రహించిన ప్రసాదాలను (దారిదీపాలు పుస్తకం, జపమాల, 2026 క్యాలెండర్, నిత్య దర్శనం, లడ్డూ) అందుకొని, అన్నపూర్ణా క్షేత్రములో షడ్రసోపేతమైన భోజన ప్రసాదాన్ని తీసుకుని, సదస్సుకు వచ్చిన భక్తులంతా తృప్తులుగా గృహోన్ముఖులు కావడంతో జాతీయ సుందర సత్సంగ్ సదస్సు విజయవంతంగా సమాప్తమయినది.

హరిః ఓం తత్ సత్

(సర్వమ్ శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానద సద్గురు దివ్య చరణారవిందార్పణ మస్తు!)



ఆత్మ బంధువులారా

ఓం నమో భగవతే వాసుదేవాయ.

మన కెన్నో కావాలని ఉంది. కావాలనుకున్న వన్నీ కలిసి రావు. కనుక కలిసొచ్చిన వాటినే మనవిగా భావిస్తాము. ఇది **మమత్వం.** మమకారం; నాది అనే భావం. జీవితంలో ఏది నాది? నా కున్నది నాది అవుతుందేమో గాని, నాది కావాలి అనుకున్నది నాది కాదు. ఆశించి పొందలేనిది నాది కానపుడు, పొంది పోగొట్టుకొనేది మాత్రం నాది ఎలా అవుతుంది?

'నాది కానిది - నాది' అనే రెండిటిలో (1) ఏది నాది కాదో అది నా మనస్సులో ఉన్నా నాది కానిదే. (2) నాది ఏదో అది నాది కాకుండా పోయేందుకే ఉన్నది కనుక 'నాది' అనుకున్నది కూడా నాది కానిదే. కాకపోతే, నాది కానిది ఏదో అది కానిది అని స్పష్టంగా తెలుస్తూ ఉంది. నాది అనుకున్నది అలా స్పష్టంగా తెలియకపోయినా నాది కాదనే సత్యాన్ని స్పష్టపరచేందుకే నాదిగా ఉంది. ఇక ఏది నాది? **'మమ'** అనే దెక్కడుంది? మమత్వం అనే పదానికి అర్థ మేమిటి? దేని అర్థం దానిలోనే ఉంటుంది. ఒకదాని అర్థాన్ని మరొకదానిలో వెతకటం అర్థరహితం. **(మమత్వం, మమ - త్వం).** 'మమ' అంటే నాది. 'త్వం' అంటే నీవు. 'నాది' అనేది ఏదున్నా వాస్తవానికి అందులో ఉండేది 'నీవే' **(త్వమేవ).**

ఈ ప్రపంచంలో 'నాది' అని చెప్పుకోదగింది ఏదీ లేదు. మనదైతే, మన కెందుకు దూర మవుతుంది? 'ఈ దేహం నాది' అనవచ్చు. దేహం మనదైతే మన మాట వినదు ఎందుకని? మనల్ని విడిచిపెట్టి వెళ్ళడం దేనికని? మనది కానిది కనుకే మన ఇష్టానుసారం కాకుండా తన దారిన పడి తాను పోతూ ఉంది. ఇలా ఎన్ని పోతున్నా, 'నాది' అనేది పోవటం లేదు. పోయిన తరువాత కూడా 'నాది పోయింది' అంటున్నాము. 'పోయింది నాదే' అని తిరుగ తోడుతున్నాము. నీదైతే ఎందుకు పోతుంది? పోయింది నీదెలా అవుతుంది? ఈ బంతి నాది అని బాల్యంలో గంతులేశాం. ఈ చొక్కా నాది, ఈ ఇల్లు నాది, ఈ భూమి నాది, ఈ ఆస్తి నాది, ఈ భామ నాది, ఈ బాధ నాది, ఈ ఉద్యోగం నాది, ఈ అజ్ఞానం నాది - నాది, నాది అని ఇలా చెప్పుకున్నవాటి ప్రక్కన 'కాదు - కాదు' అనే పదాన్ని ఏదో ఓనాడు జోడించే పని కూడా నాదే అనే సత్యాన్ని మనిషి గ్రహించే దెపుడో? మనం ఈ ప్రపంచానికి ఏమీ తీసుకొని రాలేదు. అన్నీ ఇక్కడే లభించాయి. తల్లి గర్భంలో శరీరం దొరికింది. పీల్చుకొనే గాలి ఇక్కడిదే. ఉన్నది పీల్చుకుంటున్నామే గాని సృష్టించి శ్వాసించటం లేదు. అందితే సందడి, అందనినాడు శ్మశానంలో అంగడి.

ఇదంతా నా కెక్కడిది? 'మమ' ఏది? ఎవరో ఇచ్చారు. ఆ ఎవరో నేను కాదు కనుక నీవు **(త్వం).** ఇలా **'మమత్వం'**లో **మమ** అనేది తొలగితే **'త్వం'** మిగుల్తుంది. అన్నీ నీవే. భగవాన్! **త్వమేవ సర్వం మమ దేవదేవ.**

ఓం స్వామి సుందర చైతన్యానంద

